teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 264 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 29 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఐఏఎంసీ భూమి కేటాయించడంపై తీర్పు రిజర్వు




హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు రూ.3.7 ఎకరాల భూమి, ఏడాదికి రూ. 3 కోట్ల చొప్పున కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం తీర్పు రిజర్వు చేసింది. ఐఏఎంసీ పూర్తిగా ప్రైవేటు సంస్థ అని, దానికి ప్రజల సొమ్ము కేటాయించడం అక్రమమని పేర్కొంటూ కోటి రఘునాథరావు, ఎ. వెంట్రామిరెడ్డి అనే న్యాయవాదులు వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యా లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఐఏఎంసీ ప్రారంభమై మూడేళ్లవుతున్నా సొంతంగా ఆదాయాన్ని సమకూర్చుకోలేదా? అని ధర్మాసనం ప్రశ్నించింది. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

### ఆర్టీసీ కార్మికుల సమ్మె నోటీసుతో

# సర్కారులో అలజడి

**స్థానిక ఎన్నికల ముందు తలనొప్పిగా నోటీసులు**

**ఎలక్ట్రిక్ బస్సులు, కార్మికుల డిమాండ్లపై మల్లగుల్లాలు**

**సీఎస్, అధికారులకు నోటీసులిచ్చిన ఆర్టీసీ జేఏసీ**



ఆర్టీసీ కార్మికుల సమ్మె నోటీసుతో సర్కారులో అలజడి మొదలైంది. నాలుగు పథకాలు మొదలుపెట్టి, స్థానిక ఎన్నికల నుంచి గట్టెక్కుదామనుకున్న తరుణంలో ఈ తలనొప్పి ఏమిటని హైరానా పడుతున్నది. ఇప్పటికే పథకాల అమలుకు నిధుల లేమితో కిందామీద పడుతున్న పరిస్థితుల్లో ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చడమెలా? అనే అంశంపై తర్జనభర్జన పడుతున్నది.

హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ఇప్పుడున్న పరిస్థితుల్లో అసాధ్యం. ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించడం ఇప్పటికిప్పుడు సాధ్యమయ్యేలాలేదు. 43 వేల మంది కార్మికులు సమ్మె చేస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడాల్సి వస్తుంది. ఉ చితంగా బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళల నుంచి వ్యతిరేకత, గ్రామీణ పేదలు, చిరుద్యోగులు అష్టకష్టాలపాలయ్యే అవకాశం ఉండగా, ఈ ప్రభావం

మిగతా 2 లో




# అవార్డుల రాజకీయం!

**గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామన్న కేంద్రమంత్రి బండి సంజయ్**

గద్దర్ చుట్టూ కొత్త రాజకీయం


ఇప్పుడు సర్వత్రా చర్చలు.. ఉప చర్చలు.. విమర్శలు

గద్దర్ చుట్టూ కొత్త రాజకీయం మొదలయ్యింది. గద్దర్ నక్సలైట్ కనుక ఆయనక పద్మ అవార్డు ఎలా ఇస్తామన్న కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలతో ఇప్పుడు సర్వత్రా చర్చలు..ఉప చర్చలు..విమర్శలు, ప్రతి విమర్శలు మొదలయ్యాయి. తాజాగా తెలంగాణ నుంచి ప్రముఖులు ఎవరికీ పద్మ అవార్డులు రాకపోవడం, దీనిపై సిఎం రేవంత్రెడ్డి తీవ్రంగా స్పందించడం..తిరిగి బండి సంజయ్ విమర్శలు చేయడం తో కథ మొదలయ్యింది.



తెలంగాణ బ్యూరో, జనవరి 28 (తీన్మార్ న్యూస్): నిజానికిపద్మ అవార్డులే కాదు..ప్రతి ఒక్క విషయంపైనా ప్రజల్లో చర్చ జరగాలి. అనుయాయులకు నామినేటెడ్ రాజ్యసభ సభ్యత్వాలు, పద్మ అవార్డులు, భారతరత్నలు కూడా ఇచ్చేస్తున్నారు. అవార్డుకు ఎంపికైన వ్యక్తి

మిగతా 2 లో



## 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రదర్శనకు జాతీయ క్రీడలు గొప్ప వేదిక

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

.. వివరాలు 2లో



## ఫిబ్రవరి 7న ఉద్యోగాల అంశంలో కీలక ప్రకటన

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**దావోస్ పర్యటన ముగిసిన నేపథ్యంలో చిట్‌చాట్**

.. వివరాలు 2లో



### పెట్టుబడులపై సీఎం రేవంత్‌రెడ్డి

## కీలక వ్యాఖ్యలు

**ఎకో ఫ్రెండ్లీ ఎక్సీపీరియం పార్కును ప్రారంభించిన సీఎం**

రంగారెడ్డి, జనవరి 28 (తీన్మార్ న్యూస్): పెట్టుబడులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా ప్రొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్సీపీరియం పార్కును మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ

మిగతా 2 లో



## తుది అంకానికి చేరుకున్న కాళేశ్వరం కమిషన్ విచారణ

**ఈ దఫా ముగిసిన విచారణ షెడ్యూల్**

**తదుపరి విచారణ ఫిబ్రవరిలో**

**కెసిఆర్, హరీష్ రావు, ఈటెలకు సమన్ల జారికి అవకాశం**

హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): కాళేశ్వరం బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ తుది అంకానికి చేరుకుంది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, మేడిగడ్డ,

మిగతా 2 లో

### వన్యప్రాణులను దత్తత తీసుకున్న


## మంత్రి కొండా సురేఖ

**వాటి సంరక్షణ వ్యయం తానే బరిస్తున్నట్లు ప్రకటన**



వరంగల్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): జంతు సంరక్షణ కేంద్రాల్లోని వన్యప్రాణులను ప్రతిఒక్కరూ దత్తత తీసుకోవాలి, మూగ జీవుల సంరక్షణలో బాధ్యతగా వ్యవహరించాలని పిలునిచ్చిన అటవీశాఖ మంత్రి కొండా సురేఖ తన వంతు బాధ్యత నిర్వహించారు. హనుమకొండ జూ పార్క్ లోని రెండు వన్యప్రాణులను

మిగతా 2 లో




### జీహెచ్ఎంసీలో మేయర్‌తో

## కాంగ్రెస్ కార్పొరేటర్ల సమావేశం

హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): హెచ్ఎంసీ రాజకీయం వేడెక్కింది. రేపు జీహెచ్ఎంసీలో సర్వసభ్య సమావేశం జరగనుంది. కాగా ఫిబ్రవరి 11 తర్వాత మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసం పెట్టేందుకు

మిగతా 2 లో

## స్పామ్ ఫోన్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన

**ట్విట్టర్ వేదికగా పోలీసుల ఆసక్తికర పోస్ట్**

పదే పదే స్పామ్ కాల్స్ ఎందుకు వస్తున్నాయి అని తెలంగాణ పోలీస్ ట్వీట్ చేసింది. ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రజలను స్కాముల్లో ఇరికించి, మోసం చేసేందుకు కొత్త కొత్త స్కీములు అమలు చేస్తున్నారు. ఈ స్కీములను నమ్మి అమాయక ప్రజలే గాక, చదువుకున్న వ్యక్తులు, సాఫ్ట్ వేర్ ఉద్యోగులు సైతం మోసపోతున్నారు.




హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): ఈ మోసాలతో సైబర్ నేరగాళ్లు లక్షలు వెనకేసుకొని ఉడాయిస్తున్నారు. ఈ స్కాముల నుంచి ప్రజలను కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. సైబర్

మిగతా 2 లో




## హైకోర్టులో మాజీ మంత్రి హరీష్ రావుకు స్వల్ప ఊరట

**ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ చేయొద్దని ఆదేశాలు**




## ఎస్ఏసీని పునర్వ్యవస్థీకరిస్తూ తెలంగాణ ఈఆర్సీ నిర్ణయం

**ఈ మేరకు గెజిట్ విడుదలచేసిన రాష్ట్ర ప్రభుత్వం**

## అంగరంగ వైభవంగా ప్రారంభమైన నాగోబా జాతర

**గేటు వద్ద పాము ప్రత్యక్షం**

**పామును చూసేందుకు ఎగబడ్డ భక్తులు**



.. వివరాలు 2లో

# అవార్డుల రాజకీయం!

మొదటి పేజీ తరువాయి

అర్హుడా కాదా అన్నది చూడడం లేదు. గతంలో సచిన్ టెండుల్కర్‌కు భారతరత్న ఇచ్చారు. ఆయన దేశానికి ఏ రకంగా ఉపయోగ పడ్డాడో తెలియదు. తన సొంత కెరీర్, రికార్డుల కోసం మాత్రమే అతను క్రికెట్ ఆడాడు. సామాజికంగా బాధ్యతగా పెద్ద సేవలేవీ చేయలేదు. కానీ దేశానికి సేవ చేయడమే గాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థలో మూలస్తంభంగా నిలిచిన రతన్ టాటాకు మాత్రం మనం భారతరత్న ఇవ్వలేదు. ఆయన బతికి ఉన్నప్పుడే ఇచ్చివుంటే గౌరవించుకుని ఉన్నట్లుగా ఉండేది. పివి నరసింహారావుకు భారత రత్న ఇవ్వడంలో కాంగ్రెస్ చేసిన రాజకీయం అంతా ఇంతాకాదు. దేశాన్ని నిలబెట్టిన పివిని అవమానించిన కాంగ్రెస్, చివరకు భారతరత్న ఇవ్వకుండా మరింతగా అవమానిం చింది. అలాంటి కాంగ్రెస్ ఇప్పుడు రాజ్యాంగం పేరిట రాజకీయాలు చేస్తోంది. ఇక బిజెపి కూడా సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్‌ను రాజ్యసభకు పంపింది. అలాగే కాంగ్రెస్ తెలంగాణ నుంచి అభిషేక్ మనుసిం ఘ్వీని రాజ్యసభకు పంపింది. తెలంగాణ కోసం కొట్లాడిన ఎందరినో కాదని ఓ లాయర్‌కు అవకాశం ఇచ్చింది. ఎవరు అధికారంలో ఉన్నా నిజాయితీ లేకుండా పోయింది. అందుకు బిజెపి మినహాయింపు కాదని చెప్పాల్సిందే. ఇవన్నీ ఇలావుంటే తాజాగా పద్మ అవార్డుల పంచాయితీ వచ్చింది. తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ రచ్చ చేసింది. ఈ వ్యవహా రంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు తగ్గేదే లేదంటూ కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానిది..ముమ్మాటికి వివక్షే అని కాంగ్రెస్ పార్టీ మండిపడుతోంది. అటు బీజేపీ మాత్రం..జాబితా పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. రిపబ్లిక్‌డే ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలం గాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వక పోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు.



గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయ ధీర్ తిరుమలరావు పేర్లు.. పద్మ అవార్డుల కోసం పంపించారు. వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు.. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు. అయితే ఇందులో కనీసం చుక్కారామయ్య పేరును కూడా పరిశీలించకపోవడం, కవి అందెశ్రీ పేరును కూడా పరిశీలించకపోవడం దారుణంగానే చూడాలి. గద్దర విషయంలో కూడా బిజెపి అతిగా మాట్లాడడం మానితే మంచిది. గద్దరు ప్రజాకవి. నక్సలైట్ ఉద్యమం నుంచి జనజీవన స్రవంతిలోకి వచ్చారు. అలా వచ్చిన వారిలో ప్రస్తుత మంత్రి సీతక్క కూడా ఉన్నారు. వారిని తక్కువ చేసి చూడడం, మాట్లాడడం మంచిది కాదు. పద్మ అవార్డుల విషయంలో జరిగిన వివక్ష క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్‌లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు. బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా?అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ ప్రశ్నించారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ ఖండించారు... బుద్దిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్‌లోని తెలంగాణ ఉ ద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి. అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు. అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు. గద్దర్‌కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ మరో బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అయితే అవార్డుల ఎంపిక ఖచ్చితంగ ఆపారదర్శకంగానే సాగాలి. అర్హులకే అవార్డులు కానీ, రాజ్యసభ సభ్యత్వాలు కానీ దక్కాలి. బిజెపి ఈ విసయంలో పారదర్శకంగా పనిచేస్తే మంచిది

## జీహెచ్ఎంసీలో మేయర్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్ల సమావేశం

మొదటి పేజీ తరువాయి




బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. ఈ క్రమంలో జీహెచ్ఎంసీలో మేయర్‌తో కాంగ్రెస్ కార్పొరేటర్ల సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. మరోవైపు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కార్పొరేటర్ల సమావేశం నిర్వహించారు. అలాగే నేడు బీఆర్ఎస్ అధిష్టానం ఆధ్వర్యంలో గ్రేటర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కార్పొరేటర్ల మీటింగ్ జరుగనుంది. ఇదిలా ఉంటే అవిశ్వాసంపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పందించారు. అవిశ్వాసంకు ఎంత మంది కావాలో కూడా బీఆర్ఎస్, బీజేపీకి తెలియదని విమర్శించారు. ఫిబ్రవరి 11తో నాలుగేళ్లు పూ-ర్తవుతుంది కాబట్టి ఆ తర్వాతే అవిశ్వాసం పెట్టాలని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కార్పొరేటర్లకు జీహెచ్ఎంసీ యాక్ట్ గురించి తెలియదని పేర్కొన్నారు. ఎంత మెజారిటీతో అవిశ్వాసం నెగ్గుతుందో కూడా తెలియదని విజయలక్షి ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ఈ విషయంపై కౌన్సిల్ మీటింగ్‌లో రాద్ధాంతం చేయాలని చూస్తే ఊరుకోమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హెచ్చరించారు. ఎల్లుండి జరగబోయే జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రజా సమస్యలపై చర్చించాలని తెలిపారు. దీనికి కార్పొరేటర్లు సహకరించాలి. గొడవలు చేసేందుకు కౌన్సిల్ వేదిక కాదు ఇది ఎలక్షన్ ఇయర్, అభివృద్ధి పై కార్పొరేటర్లు దృష్టి పెట్టాలని గద్వాల్ విజయలక్ష్మి పేర్కొన్నారు.

## వన్యప్రాణులను దత్తత తీసుకున్న మంత్రి కొండా సురేఖ

మొదటి పేజీ తరువాయి

దత్తత తీసుకున్నారు. వాటి సంరక్షణ వ్యయం పూర్తిగా తానే బరిస్తున్నట్లు ప్రకటించి జూ పార్క్ సిబ్బందికి చెల్లించారు. హనుమకొండ లోని కాకతీయ జూవలాజికల్ పార్క్ లోకి ఈ మధ్యకాలంలోనే రెండు బెంగాల్ టైగర్స్ ను తీసుకొచ్చారు.. జంతు ప్రేమికులు సందర్శనార్థం పులుల ఇన్క్లోజర్స్ ను మంత్రి కొండా సురేఖతో పాటు, స్థానిక ఎంమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరూ వన్య ప్రాణులను దత్తత తీసుకోని మూగజీవుల పోషణలో పాలు పంచుకోవాలని సూచించారు. ఈ క్రమంలో తన వంతు బాధ్యతగా నీల్గాయ్, సాంబార్ డీర్, చౌసింగా, అడవి దున్నలను మొత్తం నాలుగు మూగ జీవులను దత్తత తీసుకున్నారు.. వన్యప్రాణుల దత్తత ప్రక్రియను పూర్తిచేసిన మంత్రి సురేఖ.. సంవత్సర కాలానికి ఒక్కో వన్యప్రాణికి ఆహారం, సంరక్షణ కోసం రూ. 50 వేల చొప్పున మొత్తం నాలుగు వన్యప్రాణులకు కలిపి రూ. 2 లక్షలను చెల్లించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, జూలో వన్యప్రాణులను దత్తత తీసుకోవడానికి పక్షి ప్రేమికులు, జంతు ప్రేమికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వారి వారి సామర్థ్యాన్ని బట్టి చిన్న చిన్న పక్షులు, తాబేళ్ళు మొదలు పులుల వరకు మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరం చొప్పున దత్తత తీసుకుని, వాటి సంరక్షణ బాధ్యతలను చేపట్టవచ్చిన మంత్రి సురేఖ తెలిపారు.. జంతు ప్రేమికులు అటవీ అధికారులను సంప్రదించి వన్యప్రాణుల దత్తతకు సంబంధించిన మార్గ దర్శకాలను అనుసరించి, వారి వారి ఇష్టానుసారం జంతువులను దత్తత తీసుకునే వెసులుబాటును అటవీశాఖ కల్పిస్తున్నదని తెలిపారు.

## స్పామ్ ఫోన్ కాల్స్ పై ప్రజలకు అవగాహన

మొదటి పేజీ తరువాయి

నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటున్నారు. ఇందుకోసం సామాజిక అవగాహనా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తూ అమాయక ప్రజలు సైబర్ నేరాలకు గురి కాకుండా అవగాహన కల్పిస్తారు. ఈ క్రమంలోనే స్పామ్ ఫోన్ కాల్స్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ట్విట్టర్ లో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ఇందులో పదే పదే స్పామ్ కాల్స్ ఎందుకు వస్తున్నాయి. అంటూ అలాంటి కాల్స్ వస్తే ఊరికే వదిలేయొద్దని తెలిపింది. ఎక్కడ పడితే అక్కడ మొబైల్ నంబర్స్ ఇవ్వొద్దని, ఏదైనా వెబ్ సైట్లో రిజిస్ట్రేషన్ కోసం వివరాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. అలాగే వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసేముందు బాగా ఆలోచించాలని చెబుతూ లక్కీ డిప్ కోసం వివరాలు ఇచ్చే ముందు జాగ్రత్తగా ఉండాలని, మీరు ఇచ్చే వివరాలే స్పామ్ కాల్స్ కు కారణమని గుర్తుంచుకోండి అని హెచ్చరించింది. ఇక దీనిపై మీరు చేసే చిన్న చిన్న పొరపాట్లే మిమ్మల్ని సైబర్ మోసాల బారిన పడేలా చేస్తాయని తెలిపింది. ఎక్కడపడితే అక్కడ మొబైల్ నంబర్స్, అడ్రస్ ఇవ్వొద్దని, గిఫ్ట్స్, లక్కీడిప్ పేరిట వచ్చే కాల్స్‌కు స్పందించొద్దని తెలంగాణ పోలీస్ కీలక సూచనలు చేసింది.

## ఎస్ఏసీని పునర్వ్యవస్థీకరిస్తూ తెలంగాణ ఈఆర్సీ నిర్ణయం



హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): విద్యుత్ రంగంపై డిస్కమ్‌లు సిద్ధం చేసే పాలసీలపై నిరంతరం చర్చించడం, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు సేవలు, వినియోగదారుల ప్రయోజనాలపై విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ)కి సూచనలు అందించడానికి వీలుగా రాష్ట్ర సలహా మండలి (ఎస్ఏసీ)ని పునర్వ్యవస్థీకరిస్తూ తెలంగాణ ఈఆర్సీ నిర్ణయం తీసుకుంది. మంగళవారం గెజిట్ విడుదల చేసింది.

**విద్యుత్ ఉద్యోగుల డీఏ పెంపు**

విద్యుత్ ఉద్యోగుల డీఏను పెంచుతూ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెరిగిన డీఏ 2024 జూలై 1 నుంచి అమల్లోకి రానుండగా.. జనవరి నెల నుంచే వేతన రూపంలో అందనుంది. 2024 జనవరి 1 నుంచి 11.780 శాతంగా ఉండగా.. దీన్ని 14.074 శాతానికి పెంచారు. దాంతో ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు 2024 జూలై నుంచి డిసెంబరు దాకా బకాయిలను జీపీఎఫ్ అకౌంట్‌లలో జమచేయనున్నారు. దీంతో ఫిబ్రవరి 1న పెరిగిన డీఏతో ఉద్యోగులు వేతనాన్ని అందుకోనున్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు ఒక డీఏ మాత్రమే (జనవరి 1 నుంచి) పెండింగ్‌లో ఉంది.

## ఆర్టీసీ కార్మికుల సమ్మె నోటీసుతో సర్కారులో అలజడి

మొదటి పేజీ తరువాయి



ఎన్నికల ఫలితాలపై ఉంటుందని ఆందోళనకు గురవుతున్నది. ఆర్టీసీ సమ్మెతో ప్రభుత్వ లొసుగులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం అవుతాయనే భయం ప్రభుత్వాన్ని వెంటాడుతున్నది. నాడు ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఏడాదైనా అమలు దిశగా అడుగు ముందుకు వేయలేదు. పలుసార్లు ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో కార్మికుల్లో అసంతృప్తి పెరిగిపోయింది. దీనికితోడు ఆర్టీసీ ఎండీ వ్యవహార శైలి కార్మికులకు మింగుడు పడటంలేదు. సంక్రాంతికి ముందే సమ్మె నోటీసు ఇవ్వాలని భావించినప్పటికీ, పండుగ సమయంలో సమ్మెకు వెళ్తే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని కార్మిక సంఘాలు భావించాయి. ఆర్టీసీకి లాభాలొస్తున్నాయని సీఎం, మంత్రులు పదే పదే చెప్తూనే కార్మికులకు అందాల్సిన ఏరియర్స్ ఇవ్వకపోవడంతో ఆర్టీసీ సంఘాలు సమ్మె సైరన్ మోగించాయి. సోమవారం ఆర్టీసీ యాజామాన్యానికి నోటీసులిచ్చిన ఆర్టీసీ జేఏసీ నేతలు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి, కార్మికశాఖ కమిషనర్ సంజయ్‌కుమార్, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్‌కు నోటీసులిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, ప్రతినిధులు కమలాకర్, కృష్ణ, సుద్దాల సురేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు. సమ్మె నోటీసులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే రాబోయే రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.

## అంగరంగ వైభవంగా ప్రారంభమైన నాగోబా జాతర



ఇంద్రవెల్లి, జనవరి 28 (తీన్మార్ న్యూస్): మెస్రం వంశీయుల అల్లుళ్లు కోనేరులోని నీటిని తోడి మట్టికుండల్లో నింపగా, ఆ కుండలను మహిళలు తలపై పెట్టుకొని వరుసగా నాగోబా ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం పక్కనే ఉన్న పాత మట్టి పుట్టల వద్ద నుంచి అల్లుళ్లు మట్టిని తీసుకొని రాగా ఆడపడుచులు తెచ్చిన నీటితో మట్టిని కలిపి పుట్టలను తయారు చేశారు. తయారు చేసిన పుట్టల నుంచి మట్టిని ఉండల రూపంలో తీసుకుని ఏడు వరుసలతో బౌలదేవతను తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా మహాజాతర మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదివాసీల ఆరాధ్య దైవమైన నాగోబాకు పవిత్ర గోదావరి జలాలతో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు, పూజారీ (కటోడ) మెస్రం దేవ్‌రావు, మెస్రం కోసురావు పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి వరకు బేటింగ్ (కొత్త కోడళ్ల పరిచయం), భక్తుల దర్శనం, ప్రత్యేక పూజలు కొనసాగాయి. కాగా, మంగళవారం ఆలయ ప్రాంగణం గేటు వద్ద పాము ప్రత్యక్షమైంది. పామును చూసేందుకు భక్తులు ఎగబడ్డారు.

## ప్రశంసల్లో ముంచెత్తిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

### అండర్ 19 టీ20 ప్రపంచకప్ చరిత్రలో తొలి సెంచరీ నమోదు




తెలంగాణ బ్యూరో, జనవరి 28 (తీన్మార్ న్యూస్): మహిళల అండర్ 19 టీ20 ప్రపంచకప్ చరిత్రలో తొలి సెంచరీ నమోదు చేసిన భారత మహిళా క్రికెటర్, తెలంగాణ బిడ్డ గొంగడి త్రిష(110)ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసల్లో ముంచెత్తారు. ప్రపంచ వేదికపై సత్తా చాటిన తెలంగాణ బిడ్డకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మున్ముందు మరింత ఉన్నతంగా రాణించి, తెలంగాణ క్రీడాకారులకు ఆదర్శప్రాయంగా నిలవాలని ఆకాంక్షిస్తున్నట్లు కోరారు. త్రిష లాంటి మరింత మందిని మెరికల్లాంటి క్రీడాకారులుగా తయారు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కృషిని రేవంత్ రెడ్డి వివరించారు. అందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటును ఉదాహరణగా చూపారు. క్రీడల ప్రోత్సాహానికి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, త్రిషలాంటి క్రీడాకారిణిల స్ఫూర్తితో, తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణించాలని పిలుపునిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

**మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో తొలి శతకం.**

భద్రాద్రి – కొత్తగూడెం జిల్లా, భద్రాచలంకు చెందిన త్రిష అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కింది. కౌలాలంపూర్‌లోని బయుమాస్ ఓవల్ వేదికగా మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో త్రిష ఈ ఘనత సాధించింది. 53 బంతుల్లో వంద మార్క్ చేరుకున్న త్రిష మొత్తంగా 59 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సల సాయంతో 110 పరుగులు చేసింది. అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇంతవరకు ఎవరూ సెంచరీ చేయలేదు. భారత క్రికెటర్‌దే తొలి శతకం.

## ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రదర్శనకు జాతీయ క్రీడలు గొప్ప వేదిక : ప్రధాని మోదీ

(న్యూ ఢిల్లీ, జనవరి 28 (తీన్మార్ న్యూస్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం డెహ్రాడూన్‌లో అబ్బురపరిచే కార్యక్రమంలో 38వ జాతీయ క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడలు కేవలం క్రీడాపోటీలకు మించినవని అన్నారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఇదొక గొప్ప వేదిక అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. దేశంలోని నలుమూలల నుంచి వేలాది మంది యువత ఉత్తరాఖండ్‌లో తమ సత్తా చాటబోతున్నారని అన్నారు. ఈసారి జాతీయ క్రీడల్లో అనేక స్వదేశీ మరియు సాంప్రదాయ ఆటలు కూడా చేర్చబడ్డాయని శ్రీ మోదీ మాకు తెలియజేశారు. ఈ ఏడాది జాతీయ క్రీడలు కూడా ఒక విధంగా గ్రీన్ గేమ్స్. దేశంలోని అథ్లెట్లు తమ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పెంపొందించుకునేందుకు ప్రభుత్వం మరిన్ని అవకాశాలను కల్పిస్తోందని ప్రధాని ఉద్ఘాటించారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ గట్టి ప్రయత్నం చేస్తోందని ఆయన హైలైట్ చేశారు. వచ్చే నెల 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని 8 జిల్లాల్లోని 11 నగరాల్లో జాతీయ క్రీడలు జరుగుతున్నాయి. ఈ ఈవెంట్‌లో మొత్తం 47 ఈవెంట్‌లు 35 గేమ్‌లు నిర్వహించబడతాయి. కేంద్ర మంత్రులు, భారత ఒలింపిక్ సంఘం అధికారులు, జాతీయ క్రీడాకారులు సహా పలువురు అతిథులు కూడా ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. క్రీడల లాంఛనప్రాయ ప్రారంభోత్సవానికి ముందు, జనవరి 26న ఉధమ్ సింగ్ నగర్‌లోని గోలాపర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయి, ఇందులో మణిపూర్ మరియు మహారాష్ట్ర తమ మొదటి పతకాలను సాధించాయి. దేశం నలుమూలల నుండి అథ్లెట్లు ఉత్సాహభరితమైన అథ్లెట్ల పరేడ్‌లో పాల్గొన్నారు, ఐక్యత మరియు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తారు. 13 జిల్లాల మీదుగా 4 వేల కిలోమీటర్ల మేర స్ఫూర్తిదాయకమైన యాత్రను పూర్తి చేసిన తేజస్విని జాతీయ క్రీడల జ్యోతిని అందజేయడం ఈ కార్యక్రమంలో హైలైట్. ఈ జ్యోతిని ఒలింపియన్ లక్ష్యసేన్ ప్రధాని మోదీకి అందించారు. దేశ వృద్ధి కథలో క్రీడల ప్రాధాన్యతను ప్రధాన మంత్రి హైలైట్ చేస్తూ, భారతదేశం క్రీడలను తన అభివృద్ధి పర్యటలో అంతర్భాగంగా చూస్తోందని అన్నారు. దేశం మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడానికి క్రమంగా ముందుకు సాగుతోంది. గత దశాబ్దంలో క్రీడలకు బడ్జెట్ మూడు రెట్లు పెరిగిందని, ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలలో ఆధునిక సౌకర్యాల కల్పన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ, యువత ఆరోగ్యకరమైన మరియు చురుకైన జీవనశైలిని స్వీకరించాలని ప్రధాని మోదీ కోరారు. అతను ఈవెంట్‌కు హాజరైన అథ్లెట్లను ప్రోత్సహించాడు మరియు గ్లోబల్ స్పోర్ట్స్ రంగంలో భారతదేశ స్థాయిని పెంచడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించాడు.

## ఫిబ్రవరి 7న ఉద్యోగాల అంశంలో కీలక ప్రకటన

హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): ఫిబ్రవరి 7న ఉద్యోగాల అంశంలో కీలక ప్రకటన ఉండబోతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దావోస్ పర్యటన విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో వచ్చిన పెట్టుబడులు ఈ ఏడాది వచ్చాయి. ఈ పెట్టుబడులను గ్రౌండ్ చేయడానికి ఇప్పటికే వర్క్ మొదలు పెట్టాం. రాబోయే ఏడాదిపై మా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. భవిషత్ అంతా ఏఐ, సైబర్ సెక్యూరిటీ పైనే దానిపై మేము ఫోకస్ పెట్టాం. గత బీఆర్ఎస్ ఐటీ పాలసీని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఐటీ పాలసీ తెస్తాం. ట్రిపుల్ ఆర్ చుట్టూ ఐటీ విస్తరించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. హైదరాబాద్ చుట్టూ ఐటీ అభివృద్ధి చేయ-ంబోతున్నాం. ఔట్ లుక్స్ మాల్స్ తరహాలో హైదరాబాద్ చుట్టూ మాల్స్ తెచ్చే యోచనలో సర్కార్ ఉంది. ఫిబ్రవరి 7వ ఉద్యోగాల అంశంలో కీలక ప్రకటన ఉండబోతోంది. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచే ఆలోచన సర్కార్‌కు లేదు. మంత్రులు ఎవరూ అలక అసంతృప్తిలో లేరు. ఆర్థిక పరిస్థితి పై అందరికీ అవగాహన ఉంది. అవినీతి ఆరోపణలు కరెక్ట్ కాదు. ఖండిస్తున్నాం. గచ్చిబౌలి అవతార్ టవర్స్ తరహాలో హకింపేట్‌లో రాబోతున్నాయి. గత ప్రభుత్వం లెక్క భవనాలు చూపించి అభివృద్ధి అనం అసలైన అభివృద్ధి ఏంటో రాబోయే ఐదేళ్లలో చూపిస్తాం.

## పెట్టుబడులపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

సినీనటుడు చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణకు భారీ పెట్టుబడులు వచ్చాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌కు పెట్టుబడులు రాకుండా చేయాలని కుట్ర చేశారని మండిపడ్డారు. ఎన్నో అపోహలు, అనుమానాలు సృష్టించారని ఫైర్ అయ్యారు. కానీ ఇన్వెస్టర్లు విశ్వాసాన్ని చాటుకున్నారని అభినందించారు. పక్కా ప్రణాళికతో వెళ్లాం కనుకే అన్ని పెట్టుబడులని కీలక వ్యాఖ్యలు చేశారు. 13 నెలల్లో రూ.లక్షా 80వేల కోట్ల పెట్టుబడులొచ్చాయని మరోసారి వెల్లడించారు. సింగపూర్ ప్రభుత్వం తో కీలక ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ లో ఇదో అద్భుత పరిణామంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. టెంపుల్, ఎకో టూరిజంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని అన్నారు. తెలంగాణలో అద్భుతమైన దేవాలయాలు ఉన్నాయని రామప్ప, వేయిస్తంభాలగుడి లాంటి ప్రపంచ ప్రఖ్యాత మందిరాలు ఉన్నాయని చెప్పారు. మన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలకు తగిన గుర్తింపు తీసుకురాలేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో టెంపుల్, ఎకో టూరిజం వెనకబడుతోంది. అందుకే టూరిజం పాలసీ తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు వికారాబాద్ లోనే మొక్కలు దొరుకుతున్నాయి. వికారాబాద్ ప్రాంతానికి ఎంతో ప్రత్యేకత ఉంది. వికారాబాద్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. కాగా, తెలంగాణ చరిత్రలో లక్షా 79 వేల పెట్టుబడులు రావడం రికార్డ్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవత్సర కాలంగా రాష్ట్రం సాధించిన పురోగతే ఈ పెట్టుబడులకు కారణమని తెలిపారు.

## తుది అంకానికి చేరుకున్న కాళేశ్వరం కమిషన్ విచారణ

మొదటి పేజీ తరువాయి

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులను, విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేత కంచర్ల రఘును విచారించిన కమిషన్.. ఈ దఫా విచారణ షెడ్యూల్‌ను ముగించింది. తదుపరి విచారణలో భాగంగా ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో జస్టిస్ ఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. ఈ దఫా విచారణ కింద మాజీ సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌లకు సమన్లు పంపించి విచారించనున్నట్లు సమాచారం. కేసీఆర్ విచారణకు సహకరించకపోయినా, హాజరుకాకపోయినా... ఇప్పటిదాకా సాక్షులు సమర్పించిన ఆధారాలే ప్రామాణికం చేసుకోవాలని కమిషన్ యోచిస్తోంది.

## హైకోర్టులో మాజీ మంత్రి హరీష్ రావుకు స్వల్ప ఊరట

హైదరాబాద్, జనవరి 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి హరీష్ రావుకు స్వల్ప ఊరట దక్కింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఫిబ్రవరి 5 వరకు హరీష్ రావును అరెస్ట్ చేయొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీష్ రావు, అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని సిద్దిపేట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు హరీష్ రావు, రాధాకిషన్ రావులపై కేసు నమోదు చేసింది. దీంతో పంజాగుట్ట పోలీసుల నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని హరీష్ రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. పూర్తి వివరాలతో పోలీసుల తరుపున వచ్చే నెల 5వ తేదీన వాదనలు వినిపిస్తామని పీపీ కోర్టుకు తెలియజేశారు. పీపీ అభ్యర్థన మేరకు ఫిబ్రవరి 5వ తేదీకి విచారణను వాయిదా వేసింది హైకోర్టు. అయితే కేసు తదుపరి విచారణ వరకు హరీష్ రావుపై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకూడదని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# ఉచితాలపై మళ్లీ చర్చ...

ప్రభుత్వాలు, సంస్థలు ప్రజలకు ప్రాథమిక అవసరాలు, సహాయం లేదా ప్రోత్సాహాన్ని అందించేందుకు ఉచిత పథకాలను ప్రవేశపెడతాయి. ఈ పథకాలు సాధారణంగా ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, విద్య, పౌర సేవలు, ఇతర అవసరాలను తీర్చేందుకు రూపొందించబడతాయి. ఉచిత పథకాలు సాధారణంగా సాయపడేవిగా అనిపించినప్పటికీ, వాటి ప్రయోజనాలు, దుష్ప్రభావాలను బట్టి వాటి ప్రయోజనాలు మేలు చేసే విధానం కూడా మారుతుంది. ఉచిత పథకాలు ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వా?వలు రూపొందిస్తున్నాయి. అమలు చేస్తున్నాయి. ఉచిత ఆరోగ్య సేవలు, ఉచిత విద్య, నిత్యావసరాల రేట్లలో తగ్గింపులు, గడచిన బడ్జెట్ ప్రకటనల్లో అన్నిటికి బాగా ఉపయోగపడే పథకాలు. వీటి ద్వారా చాలా మంది పేదరికంలో ఉన్న వారు లేదా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారు తమ జీవన విధానాలను మెరుగుపరచుకునే అవకాశాన్ని పొందుతారు. కొన్ని ఉచిత పథకాలు ప్రజలకు ప్రాథమిక సేవలను అందించేందుకు విస్తృతంగా ఉపయోగపడతాయి. ఉదాహరణకు, ఉచిత విద్య, ఆరోగ్య బీమాలు, ఉచిత సాంకేతిక శిక్షణ తదితర పథకాలు, ఆర్థికంగా అశక్తులైన వారి కోసం అవి పెద్ద ఉపకారం అవుతాయి. ఇవి అనేక పేద కుటుంబాలకు, అనాథలకు, నిరుపేదలకు, వృద్ధులకు మరియు దివ్యాంగులకు అవకాశం కల్పిస్తాయి. ఉచిత పథకాలు సమాజంలోని అన్ని వర్గాల మధ్య సమానత్వాన్ని పెంపొందిస్తాయి. ప్రాథమిక సేవలు అందించడం ద్వారా, ప్రతి ఒక్కరూ స్థాయి పరిస్థితులలో ఉంటారు. ఉదాహరణగా, ఉచిత విద్య ద్వారా అన్ని వయసుల పిల్లలు సమాన అవకాశాలను పొందవచ్చు.ఉచిత పథకాలు తీసుకుంటున్నప్పుడు కొంత మంది వారు నిజంగా అర్హులు కాని వారు కూడా పొందవచ్చు. ఈ విధంగా, రుణాలపై మరియు బడ్జెట్ పై అప్రతిష్టమైన ఒత్తిడి ఉంటుంది. కొన్ని సందర్భాలలో, కొన్ని పథకాలు ప్రజలపై అధిక భారం నింపవచ్చు, లేదా కొంతమంది దుర్వినియోగం చేసుకోవచ్చు. ఉచిత సేవలు, సదా పబ్లిక్ సేవలు, అవి నాణ్యత కలిగి ఉండకపోవచ్చు. వీటిలో కేవలం మూల్యము లేకపోవడం వల్ల, సేవల నాణ్యత తగ్గిపోవచ్చు. ఎప్పుడు డిమాండ్ అధికంగా ఉన్నప్పుడు, అందుబాటులోకి వచ్చే సేవలు కూడా బాగా నిర్వహించకపోవచ్చుప్రభుత్వం ప్రజలకు ఉచిత పథకాలను అందిస్తే, ఆ ఆర్థిక భారాన్ని ప్రభుత్వాలపై పడుతుంది. ఈ పథకాలు దీర్ఘకాలంలో ప్రభుత్వ ఖజానాను తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు, మరియు పన్నులు పెంచే అవసరం రావచ్చు. అంటే, ఒకవేళ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ఉచిత పథకాలు అనేక ఖర్చులను పెంచినప్పుడు, ఇది మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయవచ్చు. ఉచిత పథకాలు కొన్ని సందర్భాల్లో ప్రజలలో స్వీయ ప్రయోజనాన్ని తగ్గించవచ్చు. ఎవరైనా ఉచితంగా సేవలను పొందినప్పుడు, వారు ఆ సేవలకు బదులు మరొకటి ప్రయత్నించే ప్రయత్నం చేయకపోవచ్చు, ఇది వ్యక్తిగత ప్రగతి మరియు స్వయం సహాయాన్ని నెరవేర్చడం కోసం తగిన ప్రేరణ లేకుండా చేస్తుంది. ఉచిత పథకాలు ప్రజలకు ఉపయోగపడే మార్గాల్లో ఎంతో శక్తివంతంగా ఉండవచ్చు, కానీ అవి సరైన రీతిలో, సక్రమంగా, క్రమంగా అమలు చేయబడాలి. ఎప్పటికప్పుడు ఉచిత సేవలను అందించడం కాదు, అవి కచ్చితమైన అర్హతలకు మాత్రమే అందాలని, మరియు అవి నాణ్యతతో కూడిన సేవలు కావాలని నిర్ధారించుకోవాలి.ఉచిత పథకాలు, చాలా సందర్భాల్లో, ప్రజల జీవితాలను మెరుగుపరచడం కోసం ఎంతో కీలకమైనవి. అయితే, వీటి అమలులో కొన్ని సవాళ్లు, నాణ్యత సమస్యలు, ఆర్థిక భారాలు ఉండవచ్చు. అవి పేదరికం నుంచి?విముక్తి పొందడంలో సహాయపడగలవు, కానీ వాడుకదారులు అర్హత ఉండే వారికి మాత్రమే ఈ సేవలు అందిపుచ్చుకోవడం సమంజసం. మరో వైపు ఎంతకాలం ఉచిత పథకాలు ఇస్తూ పోతారు...ఉపాధి కల్పించలేరా?" అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కరోనా దగ్గర నుంచి వలస కార్మికులకు ఉచిత రేషన్ ఇస్తుండడాన్ని గుర్తు చేస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందని తెలిపింది. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 కింద 81 కోట్ల మందికి ఉచితంగాగానీ, రాయతీపైనగానీ రేషన్ పంపిణీ చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెప్పగా ఆశ్చర్యం వ్యక్తం చేసింది. "పన్ను చెల్లింపుదార్లనే విడిచిపెట్టారన్న మాట!" అని వ్యాఖ్యానించింది. కరోనా సమయంలో వలస కార్మికుల సమస్యలపై సుమోటోగా చేపట్టిన వ్యాజ్యంపై సోమవారం ధర్మాసనం విచారణ జరిపింది. ఓ స్వచ్ఛంద సంస్థ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ కరోనా సమయంలో 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకున్న వలస కార్మికులకు కూడా ఉచితంగా రేషన్ ఇచ్చారని, దాన్ని కొనసాగించాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ ఎంతకాలం ఉచితాలు కొనసాగిస్తారు...ఉపాధి ఎందుకు కల్పించరని కేంద్రాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వ ఆదాయంలో సగభాగం ఉచిత తాయిలాలకు మిగిలిన నగభాగం ఉద్యోగుల జీతాలకు పోతున్నది. అటువంటప్పుడు అభివృద్ధి జరిగే అవకాశం ఎక్కడ ఉంటుంది. అభివృద్ధికి సంక్షేమానికి తారతమ్యం లేకుండా పోతూ ఉంది. ప్రజలు గతంలో సమష్టి ప్రయోజనాల కోసం నాయకులను డిమాండ్ చేసే వారు. అది కాలక్రమేణా వ్యక్తిగత ప్రయోజనాల వైపు మరలిపోయింది. దీనిని గ్రహించిన నాయకులు అదే దిశగా ప్రయాణం చేసి ప్రజలను వ్యక్తిగతంగా సంతృప్తి పరచడంలో తలమునకలవుతున్నారు. అయితే ఇవన్నీ ఉపశమనాలు తప్ప శాశ్వత పరిష్కారం కాదని నాయకులకు తెలుసు. శాశ్వత పరిష్కారానికి దీర్ఘకాలిక లక్ష్యాలు ఉండాలి. అవి లేకపోతే ఎప్పటికీ పేదరికం అంతం కాదు. అయితే ఆర్థిక అసమానతలు అసాధారణంగా పెరుగుతున్న మన ఎగుడుదిగుడు సమాజంలో అట్టడుగు నుంచే బడుగు, బలహీన వర్గాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. పైగా, మనది సంక్షేమ రాజ్యమని రాజ్యాంగంలో రాసుకున్నాం. అభివృద్ధిలో వారినీ భాగస్వాముల్ని చేసేలా సమ్మిళిత ప్రగతి అవసరం. అందుకై చేపట్టే సంక్షేమ కార్యక్రమాల పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండదు. కానీ, ఆ ముసుగులో యోగ్యతలు, అర్హతలతో నిమిత్తం లేకుండా అమలు చేసే పథకాలు అమలు ఎప్పటికీ సమర్థనీయం కాదు. సమష్టి ప్రయోజనాలు కోసం చేపట్టే ఉచిత పథకాలు అన్నీ ఉత్పాదకమైన విగానే భావించాలి.

# రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన


### నర్వ సబ్ ఇన్స్పెక్టర్ కురుమయ్య



నర్వ జనవరి 28 తీన్మార్ న్యూస్:- రోడ్డు భద్రత,సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మంగళవారం నర్వ మండలం పతేర్చేడ్ గ్రామంలో ఉన్న జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో స్థానిక ఎస్సై కురుమయ్య అధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించకపోవడం వల్ల జరిగే అనర్ధాలు గురించి, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కురుమయ్య మాట్లాడుతూ రహదారుల పై వాహన దారులు ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ సైన్ బోర్డ్ ను గమనిస్తూ వెళ్ళాలని అన్నారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. వాహనదారులు రోడ్డుపై వెళ్తున్నప్పుడు పరిమిత వేగంలో వెళ్లాలని, ద్వి చక్ర వాహనా దారుడు ఎల్మెంట్ ధరించాలని, కార్లలో ప్రయనిస్తున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు.అనంతరం సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఉచితలకు ఆశతో మోసపోవద్దు అని, ఈ మెయిల్ లేదా మెసేజ్ లో సామాజిక మాధ్యమాల్లో ప్రకటన కనిపించిన జాగ్రత్త పడండి అని, బ్యాంకు లో ఇటువంటి అత్యవసర మార్గాన్ని సృష్టించి మిమ్మల్ని సైబర్ నేరగాళ్లు మోసాగిస్తారని గుర్తించాలని అన్నారు, పాన్ కార్డు ను అప్డేట్ చేసుకోవడం కోసం క్రింది లింక్ ను క్లిక్ చేయండి లాంటి మెసేజ్ లకు ఎవరు కూడా స్పందించవద్దు అని సూచించారు. కస్టమర్ కేర్ నంబర్ గూగుల్ లో వెతకవద్దు, మీకు లాటరీలు తగిలినాయి, మీ కు లోన్స్ ఇస్తామని, తక్కువ ధరకే ఆన్లైన్ లో వస్తువులు వస్తాయని ఇలా అనేక రకాలుగా మోసాలు జరుగుతాయని కాబట్టి అపరిచిత వ్యక్తులు నుండి కాల్స్ వచ్చినప్పుడు వారి నుండి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా బాధితులు సైబర్ నేరం నకు గురైన వెంటనే 1930కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉన్నా వెంటనే పోలీసువారి డయల్ 100 కి కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఎవరైనా గుట్కాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసువారికి తెలపాలని, బాల్య వివాహాలు చేయడ%శీ% వల్ల మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలు, జరిగే నష్టాల గురించి ఎస్సై తెలియజేశారు. ఎవరైన మొబైల్స్ ను పోగొట్టుకున్నాప్పుడు సీఈఐఆర్ అప్లికేషన్ సద్వినియోగం గురించీ తెలియజేసారు. ఎవరైనా మహిళలు, విద్యార్థినీ లు వేధింపులకు గురైతే 100 కు ఫోన్ కాల్ లేదా ఎస్సై నెంబర్ 87126 70410 ఈ నెంబర్ కు వాట్సప్ మెస్సేజ్ ద్వారా సమాచారం అందిస్తే వేధింపులకు గురి చేసే వారి పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాని అన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన వంతమైన సమాజం కోసం గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

మహబూబాబాద్ జిల్లా, జనవరి 28 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని గ్రంథాలయాలను విజ్ఞానవంతమైన సమాజం కోసం, గ్రంథాలయ పాఠకులకు, పుస్తక ప్రియులకు ఉపయోగకరంగా జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని, అదేవిధంగా జిల్లాలో ప్రతి గ్రామపంచాయతీ, మరియు మున్సిపాలిటీలు ఎప్పటికప్పుడు, గ్రంథాలయ పన్ను" చెల్లించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రంథాలయంలో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచాలి అన్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరం ఖర్చు చేసిన నిధుల వివరాలు, 2025 -26 బడ్జెట్ అంచనాలు ఆమోదం కోసం పంపేందుకు అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జె,హరిప్రసాద్ ,జిల్లా



విద్యాశాఖ అధికారి ఎ,రవీందర్ రెడ్డి ,జిల్లా పౌరసంబంధాల అధికారి వల్లోజి శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత, రుద్రారపు వీరేందర్ పాల్గొన్నారు

# వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు

**- దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ**

**- నియోజకవర్గంలోని రూ 1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



వరంగల్ జిల్లా, జనవరి 28 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో హైద్రాబాద్ తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోందని రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మాత్యులు కొండ సురేఖ తెలిపారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజక వర్గ బల్దియా పరిధిలోని 12, 21, 24, 32, 41 వ డివిజన్లలో కోటి 50 లక్షల రూపాయల బల్దియా సాధారణ నిధులతో సి సి రోడ్ లు డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, జిడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని వాకడే, అదనపు కలెక్టర్ సంధ్య రాణి కార్పొరేటర్లు కావేటి కవిత, ముహమ్మద్ ఫురా?న్, పోశాల పద్మ, పల్లం పద్మ, రామా తేజేశ్వి శిరీష్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, బల్దియా ఈ ఈ శ్రీనివాస్, తహసీల్దార్ ఇక్బాల్, డి ఈ రాజ్ కుమార్ ఏ ఈ హరికుమార్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీమతి కొండ సురేఖ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో తెలంగాణ రూపురేఖలు మార్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వరంగల్ ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి నిధుల వరద కురిపించారని మంత్రి శ్రీమతి కొండ సురేఖ తెలిపారు. ఒక వైపు మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవడంతో పాటు మరోవైపు ప్రజల చిరకాల స్వప్నమైన భూగర్భ మురుగు కాలువల వ్యవస్థను సహకారం చేసేందుకు సర్వే చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంలోపే మొదటి విడతలో కొన్ని సంక్షేమ ఫలాలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే సబ్సిడీ పై సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ చికిత్స పరిమతిని 10 లక్షల వరకు పెంచడం తదితర పథకాలను లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. రెండో విడతలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెల్ల రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకారం చుట్టి ప్రతి మండలంలోని ఒక గ్రామంలో ఈనెల 26వ తేదీన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించడం జరిగిందన్నారు. అర్హులైన నిరుపేదలకు దశలవారీగా సంక్షేమ కార్యక్రమాలను అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.అనంతరం శాఖరాశి కుంట నుండి కీర్తి బార్ వరకు గల నాలను పరిశీలించి నాలకు ఆనుకొని ఉన్న స్థలం ఆక్రమణకు గురికాకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు వెంటనే సర్వే నిర్వహించాలని, బల్దియా అధికారులను నాలను శుభ్రం చేయాలని మంత్రి ఆదేశించారు.

# సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ

**- ఎర్ర జెండా చరిత్రలో తొలిసారి దళిత బిడ్డకు అవకాశం**

**- రాజకీయాలకతీతంగా అమరచింతలో సంబరాలు**



ఆత్మకూర్ జనవరి 28 తీన్మార్ న్యూస్:-
సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జాన్ వెస్లీ ఎన్నికయ్యారు. సంగారెడ్డిలో నిర్వహిస్తున్న సీపీఎం నాలుగో రాష్ట్ర మహాసభల్లో భాగంగా కొత్త ప్రధాన కార్యదర్శితో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ( ప్రస్తుత వనపర్తి జిల్లా) అమరచింతకు చెందిన జాన్ వెస్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలందించారు. సీపీఎం పార్టీ చరిత్రలోనే మొదటిసారిగా పార్టీ రాష్ట్ర కమిటీలో అత్యున్నత పదవిని దక్కించుకున్న మొదటి వ్యక్తిగా జాన్ వెస్లీ చరిత్ర సృష్టించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి తమ్మినేని వీరభద్రం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో కొత్త ప్రధాన కార్యదర్శిగా జాన్ వెస్లీ ని మహాసభ హాజరైన ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ మహాసభల్లో సిపిఎం చరిత్రలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన తమ్మినేని వీరభద్రం ను వయస్సు రిత్యా ఈ మహాసభల్లో పార్టీ రాష్ట్ర కమిటీ నుంచి తప్పించారు. అదే సందర్భంలో 70 ఏళ్లు దాటిన నేతలను కూడా రాష్ట్ర కమిటీ నుంచి తొలగిస్తూ సిపిఎం రాష్ట్ర మహాసభలు నిర్ణయం తీసుకున్నాయి. ఇదిలా ఉండగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శిగా జాన్ వెస్లీ ఎన్నిక కావడం ఆయన స్వగ్రామైన అమరచింతలో రాజకీయాలకతీతంగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. బాణసంఛ కాల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

# మనుగొండలో ఎక్సయిస్ దాడులు







నలుగురు అరెస్ట్ 20 లీటర్ల గుడుంబా స్వాధీనం పరకాల, జనవరి 28 (తీన్మార్ న్యూస్): గుడుంబా నిర్మూలన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా పరకాల ఎక్సయిస్ స్టేషన్ పరిధిలోని గీసు కొండ మండలం లో గల గీసు కొండ, మనుగొండ, ఎలుకుర్తి లలో దాడులు నిర్వహించి మనుగొండ కు చెందిన మదాసి చిన్న ఐలయ్య, గుర్రం దేవి, ఎంబడి మల్లమ్మ, సిద్దె భాగ్యమ్మ లను అరెస్ట్ చేసి వారివద్ద నుండి (20) లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐ జ్యోతి, సిబ్బంది లక్ష్మణ చారి, రవీందర్, సమ్మయ్య, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన పుల్లూరి స్వప్న..



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా పుల్లూరు సప్న బాధ్యతలు మంగళవారం నూతన మార్కెట్ కార్యాలయంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి డి.ప్రకాష్, మార్కెట్ సెక్రటరీ ఆర్ మల్లేశం సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. 13 మంది మార్కెట్ డైరెక్టర్లు ఆమెతోపాటు పదవి స్వీకరణ చేశారు . మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రంరెడ్డి సతీష్ రెడ్డి,డైరెక్టర్లుగా కామిడి శ్రీపతి రెడ్డి,నల్లగోని సతీష్,మాదాసి సునీల్,నాయినేని రాజేశ్వరరావు,తాళ్లపల్లి శ్రీనివాస్,ఎగ్గేటి సదానందం,మనుపటి సురేష్,గడ్డం దీక్షిత్,ఉప్పల శ్రీనివాస్ రెడ్డి,ఎండి రషీద్ పాష,కందల తిరుపతి,దొడ్డ శ్యామ్ కుమార్,కటంగూరి శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గానికి ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా నూతన కమిటీకి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ ప్రణవ్ బాబు అభినందనలు తెలియజేశారు.రైతులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ,రైతు సమస్యలే ప్రధాన అజెండాగా ముందుకు వెళ్లాలని,మార్కెటింగ్ వ్యవస్థ పై మరింత నమ్మకం కలిగించేలా పాలకవర్గం పనిచేయాలని,మార్కెట్ కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కాజీపేట ఆవరణలో నూతన బస్టాండ్

## ఏర్పాటుకు కలిసి స్థల పరిశీలన

### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్ జిల్లా, జనవరి 28 (తీన్మార్ న్యూస్): కాజీపేట ఆవరణలో నూతన బస్ స్టాండ్ నిర్మాణం కోసం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఏడిఆర్ఎం గోపాల్ గార్లతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య స్థలాన్ని పరిశీలించారు. ముందుగా అధికారులతో కలిసి మ్యాప్ ద్వారా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య గారు మీడియాతో మాట్లాడుతూ వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఎన్నో సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో పరిష్కరించుకుంటూ వస్తున్నామని తెలియజేశారు. కాజీపేట నూతన బస్టాండ్ ఏర్పాటు కోసం ఈరోజు అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించామని వెల్లడించారు. ఏడాదిలోపు కాజీపేట నూతన బస్టాండును ప్రారంభించకపోతున్నా మని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కాజీపేట బస్టాండ్ ఏర్పాటు చేయాలని ప్రజలు




కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. విస్తృతమైన రైల్వే కనెక్షన్‌లలో కీలకమైన జంక్షన్ కాజీపేట అని పేర్కొన్నారు. బస్టాండు ఏర్పాటుతో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు సేవలు అందించడం జరుగుతుందని వెల్లడించారు. పార్లమెంట్ లో కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# ఉచిత శిక్షణ కై దరఖాస్తుల ఆహ్వానం

### నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్, మీర్జా అక్తార్ బేగ్

ఆత్మకూరు జనవరి 28 తీన్మార్ న్యూస్:-

తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్,బిసి వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి గురుకులాల సొసైటీ నుండి ఉమ్మడిగా నిర్వహించనున్న వి టి జి టి సెట్ 2025 ఐదో తరగతి గురుకులాల ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి నెల 23వ తేదీన నిర్వహించనున్నారు కావున దివ్యాంగులు అనాధలు మరియు పాక్షిక అనాధలు ఇట్టి గురుకుల పోటీ పరీక్షలకు దరఖాస్తులు చేసుకొని పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులను ఆత్మవిశ్వాసం నింపి వారికి వెంటనే స్ఫూర్తినిచ్చి అసాధారణ విద్యార్థిని విద్యార్థులతో పోటీపడే విధంగా లిటిల్ ఫ్లవర్ గురుకుల నవోదయ మరియు సైనిక్ శిక్షణ కేంద్రం నిర్వాహకులు మీర్జా అన్వర్ బేగ్ మీర్జా అక్తార్ బేగ్,ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కావున ఉచిత గురుకుల సైనిక శిక్షణ స్పెషల్ కేటగిరి విద్యార్థులు






సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9441591776,8019829211 నెంబర్ కు సంప్రదించగలరని వారు కోరారు.

# పనులలో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, జనవరి 28 (తీన్మార్ న్యూస్): మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ చిన్న జాతర సమీపిస్తున్నందున పనులలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తాడ్వాయి మండలం చింతల్ ఎక్స్ రోడ్, కన్నెపల్లి, మేడారంలలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కన్నెపల్లిలోని సారలమ్మ దేవాలయ పరిధిలో అన్ని పనులు, చింతల్ ఎక్స్ రోడ్ వద్ద పార్కింగ్ స్థలాలు, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలు, డ్రెస్ చేంజింగ్ రూమ్స్, శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ పరిధిలో విఐపి, వీవీఐపి పార్కింగ్ తదితర పనులలో వేగం పెంచి ఫిబ్రవరి 3వ తారీకు లోపు పనులు




పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, పంచాయతీరాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ఇరిగేషన్ ఈ ఈ నారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు న్యాయం చేసేంతవరకు

## నారాయణ అంత్యక్రియల నిలిపివేత ..

భిక్కనూర్: మండలంలోని రామేశ్వర్ పల్లి, మల్లు పల్లి గ్రామాల్లో పోలీసుల బందోబస్తు మంగళవారం నిర్వహించారు. మల్లు పల్లి గ్రామానికి చెందిన నారాయణ సంగారెడ్డి జిల్లాలో హత్యకు గురైన విషయం తెలిసిందే. నారాయణ పిల్లలకు న్యాయం జరిగేంతవరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని గ్రామస్తులు, బంధువులు భీష్మించుకు కూర్చుండడంతో ఆయన అంతక్రియలు ఆలస్యంగా నిర్వహించారు. వివరాల్లోకి వెళితే నారాయణ మృతదేహాన్ని సంగారెడ్డిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామానికి తీసుకువచ్చే సమయంలో నారాయణ మృతదేహాన్ని హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రామేశ్వర్ పల్లి గ్రామానికి చెందిన రాకేష్ ఇంటి వద్ద వేస్తామని గ్రామస్తులు, బంధువులు అనడంతో మల్లుపల్లి గ్రామంతో పాటుగా రామేశ్వర్ పల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం



నుండి పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. దీంతో ఇరు గ్రామాల పెద్దలు సమావేశమై నిందితుడు రాకేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి నారాయణ పిల్లలకు అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చిన అనంతరం నారాయణ అంతక్రియలను మల్లు పల్లిలో నిర్వహించారు. అంత్యక్రియలు సజావుగా జరగడంతో పోలీసులు ఇరు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# బేటి బచావో బేటి పడావో పై అవగాహన సదస్సు

నాగిరెడ్డిపేట్.. నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళ వారం రోజు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా మహిళా సాధికారిక కేంద్రం బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, లింగ సమానత్వం, బాల్యవివాహాల, ఫోక్సొ గురించి, మహిళల చట్టాలపై , మిషన్



శక్తి మరియు బిబిపి స్కీమ్స్, సుకన్య సమృద్ధి యోజన ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమ యోజన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, మహిళలకు పురుషులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో సఖి సిబ్బంది సిఐ పాల్గొని గృహహింస చట్టం, సఖి సర్వీసెస్ గురించి వివరించడం జరిగింది హెల్ప్ లైన్ నెంబర్ 100, 1930, 1098, 14567 ల గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సృజన్ కుమార్, సూపర్వైజర్స్, ఏ ఎన్ ఎం, మెయిల్ స్టాఫ్ ఆశ వర్కర్స్ డ్రగ్ ఎడ్యుకేటర్, మరియు గర్భిణీలు జనరల్ మహిళలు పురుషులు పాల్గొనడం జరిగింది.

# ఓ వ్యక్తి ఇంత క్రూరంగా ఎలా ప్రవర్తిస్తాడో

## మాకు అర్థం కాలేదు: రాచకొండ సీపీ

హైదరాబాద్ : హైదరాబాద్ మీర్ పేటలో భార్యను అత్యంత కిరాతకంగా చంపిన కేసులో నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం రాచకొండ సీపీ సుధీర్ బాబు మీడియా సమావేశం నిర్వహించారు. భార్య వెంకట మాధవి (35)ని గురుమూర్తి అత్యంత క్రూరంగా చంపాడని సీపీ వెల్లడించారు. భార్యను చంపినందుకు అతడిలో కొంచెమైనా పశ్చాత్తాపం లేదని అన్నారు. గురుమూర్తి గతంలో ఆర్మీలో పనిచేసి రిటైరయ్యాడని తెలిపారు. దర్యాప్తులో అతడు చెబుతున్న విషయాలు విని తాము నివ్వెరపోయామని చెప్పారు. 'సంక్రాంతి పండుగ సమయంలో గురుమూర్తి, వెంకట మాధవి దంపతులు వారి పిల్లలతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. పిల్లలను అక్కడే ఉంచి భార్యతో కలిసి ఇంటికి తిరిగొచ్చాడు. పిల్లల ఎదురుగా భార్యపై దాడి చేస్తే అందరికీ తెలుస్తుందని, పిల్లలను చుట్టాల ఇంటి వద్దే ఉంచాడు. మొదట భార్యతో గొడవ పెట్టుకున్నాడు. ఆ తర్వాత ఆమె తలను గోడకేసి బలంగా కొట్టాడు. దాంతో ఆమె తలకు దెబ్బ తగిలి కిందపడిపోయింది. ఆమె మీద కూర్చుని గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత ఇంట్లో ఉన్న కత్తితో మొదట కాళ్లు కట్ చేశాడు, ఆ తర్వాత చేతులు, ఇతర అవయవాలు, తల కట్ చేశాడు. వాటిని నీళ్లలో వేసి హీటర్ సాయంతో ఉడికించాడు. ఓ వ్యక్తి ఇంత క్రూరంగా ఎలా ప్రవర్తిస్తాడో మాకు అర్థం కాలేదు. ఉడికించిన అవయవాలను స్టవ్ పై కాల్చాడు. ఎముకలు కాలేదాకా వేడి చేసి వాటిని పొడి చేశాడు. ఆ రోజు సాయంత్రం వాటిని ఓ పెయింట్ బకెట్ లో వేసుకుని జిల్లెలగూడ చెరువులో కలిపేశాడు. ఇంటికి వచ్చి కొంత మేర క్లీన్ చేశాడు. బంధువుల ఇంటికి వెళ్లి పిల్లలను




తీసుకువచ్చాడు. అమ్మ ఏదని పిల్లలు అడిగితే బయటికి వెళ్లిందని చెప్పాడు. అయితే హత్య చేసిన బెడ్రూం వైపు పిల్లలు వెళ్లకుండా జాగ్రత్తపడ్డాడు. ఇలా రెండ్రోజులు జరిగింది. ఆ తర్వాత వెంకట మాధవి తల్లిదండ్రులు వచ్చి అడిగారు. చివరికి వాళ్ల అమ్మ వచ్చి మిస్సింగ్ కంప్లెయింట్ చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశాం. ఈ హత్య కేసులో ఆధారాలు సేకరించేందుకు తీవ్రంగా శ్రమించాం. హత్య చేసిన వాళ్లు ఎక్కడో చిన్న తప్పు చేసి దొరికిపోతారని మాకు ట్రైనింగ్ లో నేర్పించారు. ఈ కేసులో కూడా గురుమూర్తి అలాగే దొరికిపోయాడు. అతడు హత్య చేసిన విధానం ఎంత దారుణంగా ఉందంటే మేం పోలీసులం సరిగా వివరించలేకపోవచ్చు కానీ, మీరు జర్నలిస్టులు సరిగ్గా వివరించగలరు. విచారణలో పోలీసులను తప్పుదారి పట్టించేందుకు అనేక అబద్ధాలు చెప్పాడు' అని సీపీ సుధీర్ బాబు వివరించారు.

# హుస్సేన్‌సాగర్‌లో అగ్ని ప్రమాదం..

## గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

హైదరాబాద్: భారత మాతకు మహా హారతి కార్యక్రమం ముగింపు సందర్భంగా హుస్సేన్‌సాగర్‌లో గల్లంతైన యువకుడి మృత దేహం లభ్యమైంది. ఆదివారం రాత్రి హుస్సేన్‌సాగర్‌లో బాణసంచా కాల్చేటప్పుడు చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో సిల్వేరు అజయ్(21) ఆచూకీ దొరకలేదు. అజయ్.. గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే చదువుకునే సాయి సందీప్, రాఘవేంద్ర అతడి మిత్రులు. రాఘవేంద్ర గతంలో టపాసులు కొనుగోలు చేసినప్పుడు మణికంఠ అనే వ్యాపారికి డబ్బులు ఇవ్వలేదు. ఆ సొమ్ము ఇచ్చేందుకు మణికంఠకు ఫోన్ చేయగా, ఆయన భారత్ మాతకు మహాహారతి కార్యక్రమంలో బాణసంచా కాల్చేందుకు హుస్సేన్‌సాగర్ వచ్చినట్లు చెప్పాడు. దాంతో అజయ్‌కి చెందిన బైక్‌పై ముగ్గురూ అక్కడికి వెళ్లారు. డబ్బులు ఇచ్చి మణికంఠ తో పాటు సాగర్‌లోకి వెళ్లారు. బాణసంచా కాలుస్తున్న సమయంలో ప్రమాదం జరిగి బోటులో ఉన్న అందరూ చెల్లాచెదుర య్యారు. గాయపడిన సాయి సందీప్, రాఘవేంద్ర అర్ధరాత్రి 2 గంటల సమయం లో గాంధీ ఆస్పత్రిలో కలుసుకున్నారు. అజయ్ జాడ తెలియకపోవడంతో పోలీసులు, తల్లిదండ్రులు జానకిరామ్, నాగలక్ష్మికి చెప్పగా.. వారు



రాత్రి 3.30 గంటలకు సచివాలయ (లేక్) పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం రంగంలోకి దిగిన పోలీసులు, డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ ఎఫ్, ఫైర్ సిబ్బంది ఏడు బోట్లపై సాగర్ నీటిలో గాలింపు చేపట్టారు. 45 గంటలపాటు గాలింపు చేపట్టి మంగళవారం సాయంత్రం ట్యాంక్ బండ్ సమీపంలో అజయ్ మృతదేహాన్ని గుర్తించారు. బాణసంచా పేలుస్తుండగా జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణపతి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ మృతి చెందాడు.

# ముగిసిన ఖేల్ ఉత్సవ్ 2025..

డిచ్ పల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖేల్ ఉత్సవ్ 2025 క్రీడా పోటీలు ముగిసాయి. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం వర్సిటీ లోని కంప్యూటర్ సైన్స్ బిల్డింగ్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు పాల్గొని మాట్లాడుతూ దేశంలో యువత రోజురోజుకు మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిసై ఎంతోమంది విద్యార్థులు తమ ప్రాణాలు కోల్పోతున్నా రన్నారు. విద్యార్థులు సుభాష్ చంద్రబోస్ వంటి స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని యువతకు సూచించారు. వివేకనంద భారత సంస్కృతిని ప్రపంచ దేశాలకు చేరవేసిన మొట్టమొదటి వ్యక్తి అన్నారు. స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్లను ఆదర్శంగా విద్యార్థిలోకమంతా తీసుకొని వివేకానందుడిలా మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడి ప్రపంచంలోనే భారతదేశాన్ని విశ్వ గురు స్థానంలో ఉంచాలని పేర్కొన్నారు. చంద్రబోస్ లాగా దేశం కోసం ఆలోచించి విద్యార్థులంతా దేశ వ్యతిరేక శక్తులకు బుద్ధి చెప్పాలని అన్నారు.విద్యార్థులంతా మత్తు పదార్థాలను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు కోసం ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.కార్యక్రమానికి అతిథిగా తెలంగాణ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సంపత్ పాల్గొని మాట్లాడుతూ .. విద్యార్థులంతా మొబైల్ ఫోన్లను వదిలేసి




మైదానంలోకి వచ్చి క్రీడల్లో పాల్గొని శారీరకంగా మనసికంగా పటిష్టంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులంతా మొబైల్ వాడకంలో అలవాటైపోయి భవిష్యత్తును పాడు చేసుకోవద్దన్నారు.కార్యక్రమంలో అతిథిగా ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు,ఇందూరు విభాగ్ రేంజర్ల నరేష్ మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన మహనీయులు స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్, అంబేద్కర్ వంటి గొప్ప వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థి పరిషత్ పనిచేస్తుందని అన్నారు.అనంతరం క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి శివ,రాష్ట్ర కార్య సమితి సభ్యులు అమృత చారి,యూనివర్సిటీ అధ్యక్షులు సాయికుమార్,స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ మోహన్,యూనివర్సిటీ నాయకులు సమీర్, అక్షయ్, నవీన్, అజయ్, అనిల్, నరేందర్,నాగరాజు, సచిన్, సాయి, రాము, సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై బండి సంజయ్ మాటలు అవివేకం..

ఆర్మూర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న పథకాలకు కేంద్రం నిధులు ఇచ్చేది లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పడం అవివేకమని ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా తదితర పథకాలకు ఇందిరమ్మ పేర్లు పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని బండి సంజయ్ చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు.10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరుపై అనేక పథకాలు ప్రవేశపెడితే బండి సంజయ్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.గత పది ఏళ్లలో కేసీఆర్ పై మాట్లాడని బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి పదేపదే మాట్లాడడం మానుకోవాలని చెప్పారు.ఇకముందు బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై మాట్లాడితే సహించేది లేదన్నారు.ఈ విషయమై బహిరంగ చర్చకు సిద్ధమని ఆమె సవాల్




చేశారు.ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లావ్యాప్తంగా మహిళలకు ఎలాంటి సమస్యలు వచ్చినా తనకు సంప్రదిస్తే పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎర్ర రాకేష్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నాయకులు అశోక్, లలిత, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ప్లాన్..
# గెలుపు కోసం పార్టీల కసరత్తులు

హైదరాబాద్: లోకల్ ఫైటింగ్‌కు టైమ్ దగ్గరపడుతోంది. గ్రామంలో సంగ్రామానికి సమయం ఆసన్నమైంది. రణమే మిగిలింది. అవును ఇప్పుడు తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల చుట్టూ రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే గ్రామపంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో సాగుతున్నాయి. అన్ని ఎన్నికలు ఒకెత్తు.. స్థానిక ఎన్నికలు మరో ఎత్తు అన్నట్లుగా సాగుతుంటాయి. ఆ స్థాయిలో విలేజ్ లో పాలిటిక్స్ నడుస్తుంటాయి. కొన్ని చోట్ల సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవం అవుతుంటాయి. ఇంకొన్ని చోట్ల హోరాహోరీ పోరు నడుస్తుంటుంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగకపోయినా పార్టీల సానుభూతి పరుల చుట్టూ ఓట్ల మ్యాటర్ నడుస్తుంటుంది. చెప్పాలంటే ఊరు ఊరంతా ఓ పొలిటికల్ వైబ్రేషన్ నడుస్తుంటుంది.ఆ వైబ్రేషన్ షురూ అయ్యే టైమ్ రానే వచ్చింది. తెలంగాణలో ఇప్పుడు స్థానిక సమరానికి సమయం ఆసన్నమవుతోంది. ఇప్పటికే స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్న గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నగారా మోగబోతోంది. అటు మున్సిపల్ సమరానికి కూడా సమయం వచ్చేసింది. ఈనెల 26తో మున్సిపాలిటీల గడువు కూడా ముగియ బోతోంది. దీంతో రెండూ ఒకేసారి జరుగుతాయన్న సమాచారంతో అటు గ్రామాలు, ఇటు పట్టణాల్లో పొలిటికల్ పార్టీలు స్పీడ్ పెంచుతున్నాయి.పంచాయతీ ఎన్నికల కోసమే తెలంగాణ క్యాబినెట్ ప్రత్యేకంగా భేటీ అవబోతోంది. ఆ లెక్కన గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకే రంగం సిద్ధమవుతోందన్న చర్చ జరుగుతోంది. ఫిబ్రవరిలో 3 దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవలే ప్రభుత్వం చేసిన కులగణన వివరాలు బీసీ డెడికేటెడ్ కమిషన్ కు చేరడంతో ఈనెలాఖరుకు సర్కారుకు రిపోర్టు ఇవ్వనుంది. ఆ ప్రకారం బీసీ రిజర్వేషన్లపై సర్కారు ప్రకటన చేయగానే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ అవబోతోంది. పంచాయతీల పదవీకాలం గతేడాది ఫిబ్రవరిలోనే ముగిసింది. అయితే బీసీ రిజర్వేషన్లపై నిర్ణయం పెండింగ్ లో ఉండడం వల్లే ఎన్నికలు లేటవుతూ వచ్చాయి. దీనిపై ఏదో ఒకటి డిసైడ్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారుసో పంచాయతీ ఎన్నికల్లో హిట్ కొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ అన్ని అస్త్రాలు రెడీ చేసుకుంటోంది. తాజాగా గ్రామసభలు నిర్వహిస్తోంది. జనవరి 26 నుంచి 4 కొత్త స్కీములు ఇచ్చేందుకు అంతా రెడీ చేసింది. రైతు భరోసా ఎకరానికి 6 వేలు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నారు. గ్రామాల్లో పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే క్రమంలో కాంగ్రెస్ భారీ ముందడుగు వేసింది. పంచాయతీ సహా లోకల్ బాడీ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరగనప్పటికీ పార్టీ మద్దతు దారులే కీలకంగా ఉంటారు. సో అన్ని రకాల అస్త్రాలతో ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్న పరిస్థితి.నిజానికి పంచాయతీల్లో ఎప్పుడో సర్పంచ్ ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే కాంగ్రెస్ ఎన్నికలకు ముందు బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించింది. ఆ ప్రకారం హామీ నెరవేర్చాలనుకుంటోంది. అందు కోసమే కులగణన సర్వే చేపట్టింది. ఇది 98 శాతం పూర్తయిం దంటున్నారు. మరోవైపు బీసీ డెడికేటెడ్ కమిషన్ కూడా ఏర్పాటైంది. ఆ కమిషన్ కూడా రిపోర్ట్ ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కులగణన సర్వే ప్రాథమిక వివరాల ప్రకారం 50 శాతం కంటే ఎక్కువ బీసీలు ఉన్నట్లు చెబుతున్నారు. ఆ ప్రకారం 42 శాతం బీసీ రిజర్వేషన్లు స్థానిక ఎన్నికల్లో అమలు చేస్తే మొత్తం రిజర్వేషన్లు 68 శాతానికి చేరుతాయి. అంత కాకపోయినా 33 శాతం పెంచినా 50 శాతం లిమిట్ దాటుతుందిసుప్రీం తీర్పు ప్రకారం కోటా 50 శాతం దాటొద్దు. అయితే హైకోర్టు ఉత్తర్వులతోనే డెడికేటేడ్ కమిషన్ ఏర్పాటు చేసి.. సైంటిఫిక్ పద్దతిలో బీసీ రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకుంటు న్నందున కోర్టులు అడ్డుకోవనే ఆశతో ఉన్నారు. ఒకవేళ కోర్టుల్లో స్టే వస్తే పరిస్థితి మొదటికే వస్తుంది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుపై డెడికేటేడ్ కమిషన్ ఇచ్చే నివేదికను అసెంబ్లీలో చర్చించి.. తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆలోచన కూడా ఉంది. రాజ్యాంగం రూల్స్ ప్రకారం కోటా ఇవ్వలేకపోతే కాంగ్రెస్ పార్టీ తరఫున బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించి సర్పంచ్ ఎన్నికలకు వెళ్లే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.పరిస్థితి ఎలా ఉందంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కోటా హామీ నిలబెట్టుకోవాలని విపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది. సో లెక్కలు పక్కాగా ఉన్నా ఎవరైనా బీసీగణన సరిగా జరగలేదని చెప్పి కోర్టుల్లో కేసులు వేసే అవకాశం ఉంటుంది. సో పొలిటికల్ గా మ్యాటర్ ఎలా ఉన్నా పంచాయతీ ఎన్నికలైతే పెట్టాల్సిన పరిస్థితి. ఒకవేళ ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే వారం, పది రోజుల్లోనే కసరత్తును పూర్తి చేసి 20 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది. మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ ఎగ్జామ్స్, ఆ తర్వాత టెన్త్ పరీక్షలు ఉండనున్నాయి. దీంతో ఎన్నికల నిర్వహణకు ఇబ్బంది అవుతుంది. తెలంగాణలో 141 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. ఇటీవలే కొత్తగా 12 మున్సిపాలిటీలను, మహబూబ్ నగర్, మంచిర్యాల కార్పొరేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో 129 మున్సిపాలిటీల టర్మ్ ఈనెల 26తో ముగిసింది. మరో 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల టర్మ్ ఈ ఏడాది మే వరకు ఉంది. జీహెచ్ఎంసీ టర్మ్ వచ్చే ఫిబ్రవరి వరకు ఉన్నప్పటికీ ఈ ఏడాది డిసెంబర్ లేదా వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించే చాన్స్ ఉంది. సో ఏ రకంగా చూసినా ఉఊఓఅ నుంచి స్థానిక సమరం దాకా మ్యాటర్ హీటెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.ప్రభుత్వం ఇటీవల 12 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్ల ఏర్పాటుతో పాటు కరీంనగర్ కార్పొరేషన్ పరిధి పెంచింది. ఈ మేరకు అసెంబ్లీలో ప్రకటన కూడా చేసింది. 12 మున్సిపాలిటీల్లో కోహీర్, గుమ్మడిదల, గడ్డ పోతారం, ఇస్నాపూర్, చేవేళ్ల, మొయినాబాద్, మద్దూర్, దేవరకద్ర, కేసముద్రం, స్టేషన్ ఘన్ పూర్, అశ్వారావుపేట, ఏదులాపురం ఉన్నాయి. వీటిలో జనాభా, ఓటర్ల ప్రకారం డివిజన్ల ఏర్పాటుపై అధికారులు కసరత్తు మొదలు పెట్టేశారు. నెలరోజుల్లో ఈ ప్రాసెస్ జరుగుతుందంటున్నారు. మరో వైపు హైదరాబాద్ శివారులో ఉన్న 58 గ్రామ పంచాయతీలను సైతం శివారు మున్సిపాలిటీల్లో సర్కారు విలీనం చేసింది. ఇక్కడ కూడా వార్డుల విభజన సాగుతోంది. ఇవన్నీ త్వరలోనే కొలిక్కి రానుండగా, పంచాయతీల వెంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి సమస్య ఉండదనే అభిప్రాయం ఉంది.గడువు ముగిసిన స్థానిక సంస్థలకు ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. వీటికి ఎన్నికలు నిర్వహించకుండా.. జీహెచ్ఎంసీలో విలీనం చేయడానికి, అనంతరం పరిపాలన సౌలభ్యం కోసం విడగొట్టడానికి ఉన్న సాధ్యా సాధ్యాలను స్టడీ చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. కమిటీ ఏర్పాటు చేస్తే ఈ మున్సిపాలిటీలకు గడువు లోపు ఎన్నికలపై న్యాయవివాదాలు తప్పుతాయంటున్నారు. సో స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలంటే సవాలక్ష సవాళ్లు చుట్టుముడుతున్నాయి. ఇవి ఒక పట్టాన వీడే అవకాశాలు కూడా కనిపించడం లేదు. అయితే ఎన్నికలను మరింత ఆపే అవకాశాలు కూడా లేవు. అలా చేస్తే కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చే గ్రాంట్లు, నిధులు ఆగిపోతాయి.సో స్థానిక సంస్థల ఎన్నికలు అంటే సహజంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే అటువైపే ఎడ్జ్ ఉ ంటుంది. ఎందుకంటే నిధులు, పథకాలు, కార్యక్రమా లు, పనులు సాఫీగా జరుగుతాయన్న ఉద్దేశం జనంలో కూడా ఉంటుంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థలు చాలా వరకు అవిశ్వాస తీర్మానాలతో హస్త వశమయ్యాయి. ఆఖరికి ఉఊఓఅ మేయర్ కూడా కాంగ్రెస్ లో చేరారు. ఇక వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ పాగా వేసేందుకు కాంగ్రెస్ అన్ని అస్త్రాలు రెడీ చేసుకుంటోంది. అటు బీఆర్ఎస్ కూడా యాక్టివేట్ అవుతోంది. జనంలో ఉండేందుకు ప్రయత్నాలన్నీ చేస్తున్నారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం ఫాంహౌజ్ నుంచి బయటకు రాకపోవడం ఆ పార్టీకి పెద్ద మైనస్ గా మారుతోంది. ఓడిస్తే రెస్ట్ తీసుకుంటం అని గతంలో అసెంబ్లీ ప్రచారాల సమయంలో చెప్పినట్లుగానే ఫాంహౌజ్ కే పరిమితమయ్యారా అన్న చర్చ జనంలో జరుగుతోంది.మొన్నటికి మొన్న లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క స్థానం కూడా గెలవలేకపోయింది. దీంతో స్థానిక ఎన్నికలను ఆ పార్టీ సీరియస్ గా తీసుకుంటోంది. అయితే విపక్షంలో ఉండడంతో మ్యాటర్ ఎంత వరకు కలిసి వస్తుందన్న లెక్కలు వేసుకుంటున్నారు. మరోవైపు గ్రౌండ్ లో పరిస్థితులను తమవైపు తిప్పుకునేందుకు ఎంత ప్రయత్నం చేస్తున్నా పరిస్థితులు అనుకూలంగా కనిపించడం లేదన్న టాక్ నడుస్తోంది.దీంతో బీఆర్ఎస్ ఆశలన్నీ కేసీఆర్ పైనే ఉన్నాయి.

# రీయంబర్స్ మెంట్ పై యుద్ధం..

**– గోడప్రతుల ఆవిష్కరణ**

**– బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు**



కామారెడ్డి: కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఈ నెల 30 వ తేదీన హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద జరిగే బీసీ విద్యార్థుల సమర శంఖారావం గోడప్రతులను ఆవిష్కరించరు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు మాట్లాడుతూ కాంట్రాక్టర్ బిల్లులు కాదు ముందు కాలేజీ విద్యార్థుల ఫీజులు నిధులు ఇవ్వండి,విద్యార్థుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో విద్యార్థుల చదువులకే భరోసా లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్, డిగ్రీ,ఇతర వృత్తి విద్య కోర్సులు చదివే లక్షలాదిమంది పేద బీసీ,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు గత నాలుగు సంవత్సరాలుగా ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో నేడు బడుగు విద్యార్థుల చదువులు అటకెకించారని అన్నారు. ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు మేము కాలేజీలు నడపలేము అని సమావేశాలు ఏర్పాటు చేసుకునే పరిస్థితిలో ఉన్నాయని,విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉందని అన్నారు. గత బియర్ఎస్ ప్రభుత్వ బకాయిలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకుండా,బడా కాంట్రాక్టర్ల బిల్లులు వేల కోట్లు విడుదల చేస్తూ బడుగు వర్గాల విద్యార్థుల ఫీజులు నిధులు మాత్రం విడుదల చేయకపోవడం చాలా అన్యాయమని అన్నారు. కాసోజు శ్రీకాంత్ నుండి సిరిపురం యాదయ్య వరకు వందలాదిమంది బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ప్రాణాలు త్యాగాలు చేస్తే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, వారి త్యాగాలతోనే సీఎం పీఠంపై పది సంవత్సరాలు కేసీఆర్,సంవత్సరం కాలం రేవంత్ రెడ్డి కూర్చున్నారని,కానీ విద్యార్థుల ఉన్నత విద్యను పట్టించుకోకుండా పూర్తి పీజులను మంజూరు చేయకుండా ఫీజుల బకాయిలను విడుదల చేయకుండా వ్యవహరించడంతో రాష్ట్రంలోని లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.బహుజన వర్గానికి చెందిన మల్లు బట్టి విక్రమార్క ఆర్థిక మంత్రిగా ఉన్నప్పటికీ బహుజన విద్యార్థులకు ఫీజులు రాకపోవడం చాలా బాధాకరమన్నారు. గత ప్రభుత్వం బకాయిలు మేమెందుకు విడుదల చేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనడంలో ఎలాంటి ఏతుబద్ధత లేదని గత ప్రభుత్వమైన ఈ ప్రభుత్వమైనా ప్రభుత్వం ప్రభుత్వమేనని, ఆయా పార్టీల విరాళాల నుండి గాని,నాయకుల జేబులు నుండి కానీ ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు ఇవ్వడం లేదన్నారు. బడుగు బలహీన వర్గాలు చెల్లించే పన్నులు నుండి వచ్చే ఖాజానా నుండే విడుదల చేయాలని అడుగుతున్నాని అన్నారు. మరో వారం పది రోజుల్లో విద్యార్థుల వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కళాశాల యజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని అసలు తమ కళాశాలలో పరీక్షల రాయొద్దని అడ్డుకుంటున్నారని ఆయన అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కలు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బడా కాంట్రాక్టర్ బిల్లులు నిలిపివేసి బడుగు విద్యార్థుల ఫీజుల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఫీజులు విడుదల చేయాలని, అలాగే ప్రైవేటు యూనివర్సిటీలలో బీసీ ఎస్సీ ఎస్టీ సామాజిక రిజర్వేషన్లు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్ తో ఈనెల 30వ తేదీన హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద వేలాదిమంది విద్యార్థులతో బీసీ విద్యార్థుల సమర శంఖారావం సభను నిర్వహిస్తున్నామని,

ఈ సమర శంఖారావం కు వేలాది మంది విద్యార్థులు తరలి వచ్చి విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం అధ్యక్షులు వినోద్ నాయక్,కిషన్,సందీప్ నాయక్, గణేష్, రమేష్, శ్రీనివాస్, పవన్,చక్రధర్,మోహన్,శివరాం తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ మేయర్‌పై అవిశ్వాసం



కరీంనగర్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవీకాలం మంగళవారంతో ముగియనున్న క్రమంలో మేయర్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. రెండ్రోజుల కిందట మేయర్ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. దాంతో కార్పొరేటర్లు సోమవారం ఉదయం కరీంనగర్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇదే సమయంలో తనపై సోషల్ మీడియాలో అసభ్యరంగా ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు మేయర్ సునిల్‌రావు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీ తరపున మేయర్‌గా ఐదేండ్లు పదవి అనుభవించి, తీరా చివరి రోజుల్లో బీజేపీలో చేరారంటూ సునిల్‌రావుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుంకు గులాబీ పార్టీకి చెందిన 29 మంది, కాంగ్రెస్‌కు చెందిన మరో ఆరుగురు కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ చైర్మెన్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు రాజేందర్‌రావు, మహేష్, గందె మాధవి మీడియాతో మాట్లాడారు. సునీల్‌రావు మేయర్‌గా తన పదవిని ఉ పయోగించుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. నిధులను దుర్వినియోగం చేశారన్నారు. సునీల్‌రావుపై అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మెజారిటీ కోల్పోయి కూడా పదవిలో కొనసాగడం చట్టానికి విరుద్ధమని, మున్సిపల్ చట్టం ప్రకారం ఆయన్ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అధికారికంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అవిశ్వాసం కోసం తయారు చేసిన దరఖాస్తుపై బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు సంతకాలు చేశారు. అయితే, కొంత మంది వెంటనే మేయర్‌కు ఫోన్ ద్వారా తెలిపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో 24గంటల వ్యవధిలో కంప్లీట్ కానున్న పదవీకాలానికి విశ్వాస పరీక్ష పెట్టడం అనేది బీఆర్ఎస్‌లోని కొంత మంది కార్పొరేట్లకు, నాయకులకు కూడా ఇష్టం లేదని ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. అయినప్పటికీ ఈ అంశంపై మేయర్ కూడా వ్యూహాత్మకంగా వ్యవహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంగళవారం పాలవర్గ పదవీకాలం ముగుస్తుండటంతో ఏజెండా రహిత సమావేశం ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోలేదు. ప్రజాప్రతినిధులందరికీ సన్మానం చేసే కార్యక్రమంతో సరిపెట్టాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది.

### సీపీకి మేయర్ సునిల్‌రావు ఫిర్యాదు

తనపై 56వ డివిజన్ కార్పొరేటర్ రాజేందర్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్, 43వ డివిజన్‌కు చెందిన నవాజ్‌హుస్సేన్ సహా మరికొందరు ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మేయర్ సునిల్‌రావు కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

తన ఫొటోలతో కూడిన అసభ్యకరమైన, తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగంచే ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తూ కామెంట్లు చేస్తున్నారని తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో అరుదైన చికిత్స..




వేములవాడ : వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాళ్ళపేట గ్రామానికి చెందిన (53) ఏండ్ల మహిళకి ఫిల్లోడ్స్ టూమర్ అనే రొమ్ములో గడ్డని ప్రత్యేక అరుదుగా ఇచ్చే మత్తు ద్వారా వైద్య బృందం తొలగించారు. మామూలుగా నరం ద్వారా శరీరం మొత్తం మత్తు వచ్చేలా చేసి గడ్డని తొలగిస్తారు. అలా కాకుండా వేములవాడలో ఉన్న మత్తు వైద్య బృందం డా. పెరికె తిరుపతి, డా.రవీందర్, డా.రాజశ్రీ, డా.ప్రియాంక, డా. సిద్దార్థ్, ఇతర సహాయక సిబ్బంది కలిసి రీజినల్ తొరసిక్ ఎపిడ్యూరల్ అనే పద్ధతిలో మత్తు మందుని పంపి రోగికి ఆపరేషన్ సమయంలో అలాగే ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు నొప్పి పూర్తిగా తెలవకుండా ఉ ండే విధంగా చేశారు. ఇట్టి ఆపరేషన్ నీ సీనియర్ సర్జన్ డా. పెంచలయ్య నేతృత్వంలో డా. రాజేంద్ర, డా. జెన్సీ, డా.రత్నకుమారి ఇతర సహాయక సిబ్బంది ఝాన్సీ, బ్లొసం కలిసి విజయవంతంగా నిర్వహించారు.

## అమల్లోకి ప్రత్యేక అధికారుల పాలన

వరంగల్: తెలంగాణలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలక మండళ్ల పదవీ కాలం జనవరి 26తో ముగిసింది. దీంతో.. ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారుల్ని నియమిస్తు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో.. నుంచి వీటిలో ప్రత్యేక అధికారుల పరిపాలనలోకి వెళ్లనున్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఈ వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం..2020లో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిం చారు. వాటి పదవీ కాలమైన ఐదేళ్లు పూర్తయ్యింది. వాస్తవానికి ఐదేళ్ల పదవీ కాలం ముగియడానికి ముందే స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహిం చి, నూతన పాలక వర్గాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ వివిధ కారణాలతో ప్రభుత్వ ఇప్పటి వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిం చలేదు. దాంతో.. ఆయా పాలక వర్గాల స్థానాల్లో ప్రత్యేక అధికారుల్ని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు..జనవరి 26తో 129 మున్సిపాలిటీలకు పదవీ కాలం ముగిసింది. రెండు రోజుల తర్వాత అంటే 28 జనవరి నాటికి కరీంనగర్ కార్పొరేషన్ పాలక వర్గం పదవీ కాలం ముగిసిపోనుంది. ప్రస్తుతానికి వీటి పరిపాలనను ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోకి వెళ్లనుండగా, కొత్త పాలక మండళ్లు ఏర్పడే వరకు వీరు నేతృత్వం వహించనున్నారు. ఇందుకోసం.. 128 మంది ప్రత్యేక అధికారుల్ని ప్రభుత్వం ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. కాగా.. నర్సాపూర్ మున్సిపాలిటీని మంచిర్యాల, కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనం చేయడం ద్వారా రెండు స్థానాలు తగ్గిపోయినట్లు వెల్లడించింది.

## మునుగోడు నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే..



చౌటుప్పల్ రూరల్: మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయం లో గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి దినసరి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిసి మునుగోడు నియోజవర్గంలో జరుగుతున్న కొత్త రోడ్ల నిర్మాణం నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. గ్రామీణ నియోజకవర్గమైన మునుగోడులో జరుగుతున్న కొత్త రోడ్ల నిర్మాణము, మరమ్మత్తులు, మౌలిక సదుపాయాల కల్పన పై ప్రత్యేకంగా చర్చించారు. నియోజకవర్గం లో ఏడు మండలాలు రెండు మున్సిపాలిటీలు భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులపై నియోజకవర్గ మ్యాప్ తో కులం కూశంగా చర్చించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అతిపెద్ద నియోజకవర్గం మునుగోడుకు పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ నుంచి అధిక నిధుల మంజూరు చేయాలని మంత్రి సీతక్కను ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి విజ్ఞప్తి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా జిల్లా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి వెంకట్ రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

# మంత్రి శ్రీధర్‌బాబుతో అయిచి ప్రతినిధి బృందం భేటీ

**– ఓ ప్రయివేటు పరిశ్రమకు విద్యుత్ సర్వీసును ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ ఏఈని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా**

**– 20వ ఆసియా క్రీడలకు ఆహ్వానం**



హైదరాబాద్: జపాన్‌లోని అయిచి రాష్ట్రానికి చెందిన ప్రతినిధి బృందం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో హైదరాబాద్‌లోని సచివాలయంలో భేటి అయింది. 2026లో తమ రాష్ట్రంలో జరిగే 20వ ఏషియన్స్ గేమ్స్‌కు మంత్రిని ఆహ్వానించారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర వాణిజ్య, వ్యాపార అవాకాశాలపై సమావేశంలో చర్చించారు. తమ రాష్ట్రం టొయోటా కార్ల పరిశ్రమతో పాటు, ఏరోస్పేస్, ఆటోమొబైల్, రోబోటిక్స్, యంత్ర పరికరాల తయారీలో అగ్రగామిగా ఉందనీ. ఇటీవలే 'స్టేషన్ ఏఐ' పేరుతో దేశంలోనే అతిపెద్ద అంకుర సంస్థల ఇంక్యు బేషన్ కేంద్రాన్ని ప్రారంభించామని ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన అయిచి శాసనసభ్యులు హిరోహిటో కొండా మంత్రికి వివరించారు. రాష్ట్రంలోని టీ హబ్ కూడా అంకుర సంస్థల ప్రోత్సాహంలో దేశంలో ప్రముఖంగా నిలుస్తోందని మంత్రి తెలిపా రు. రెండు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు తెలంగా ణా ఆహ్వానం పలుకుతోందని ఆయన వెల్లడించారు. ఇరు ప్రాంతా లు ప్రయోజనం పొందేలా సహకారం కొనసాగించాలని భేటీలో నిర్ణయించారు. ఈ సమావేశంలో ఇండోబాక్స్ ఇండియా ఎండీ డైసుకే టాంజీ, షిన్యా సుకాడా, సపల ఆర్గానిక్స్ సీఈవో పైడి ఎల్లారెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి జి.చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళాకు వెళ్లే రైలుపై రాళ్లతో దాడి..

హైదరాబాద్ : ప్రయాగ్‌రాజ్‌కు వెళ్తున్న కుంభమేళా రైళ్లపై అటాక్ జరిగింది. మధ్యప్రదేశ్‌లోని చతర్‌పుర్ రైల్వే స్టేషన్‌లో ఆగిన ట్రైన్‌పై ప్రయాణికులు రాళ్లతో దాడి చేశారు. ట్రైన్ లోపల ఉన్న ప్రయాణికులు డోర్లు తీయడం లేదని.. ఫ్లాట్‌ఫామ్‌పై ఉన్న వ్యక్తులు అసహనంతో దాడి చేశారు. మంగళవారం ఈ ఘటన జరిగింది. చతర్‌పుర్, హర్పల్‌పుర్ రైల్వే స్టేషన్లలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ మేరకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు చెప్పారు. చతర్‌పుర్, హర్పల్‌పుర్ స్టేషన్లలో రైలు ఆగిన సమయంలో కొందరు ప్రయాణికులు ఆగ్రహంతో రైలుపై దాడి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేసిన తర్వాత రైల్వే పోలీసు అధికారులు డోర్లు ఓపెన్ చేశారు. కానీ అప్పటికే రైలు కిక్కిరిసిపోవడం వల్ల ఫ్లాట్‌ఫామ్‌పై ఉన్న ప్రయాణికులు చాలా మంది రైలు ఎక్కలేకపోయారు. రైళ్లపై దాడి జరిగిన ఘటన గురించి తమకు సమాచారం అందినట్లు జాన్సీ రైల్వే డివిజన్ పీఆర్వో మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు.



# అమెజాన్ హైదరాబాద్ ఆఫీసులో 100 కోట్ల మోసం

**– రవాణా చార్జీల పేరుతో 22 మంది ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల టోకరా**

**– సరుకుల డెలివరీకి వెళ్లకుండానే వెళ్లివచ్చినట్లు బిల్లులు**

**– సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేసిన అమెజాన్**

ప్రముఖ ఈ– కామర్స్ సంస్థ అమెజాన్ ను ఆ సంస్థ ఉద్యోగులే మోసం చేశారు. వినియోగదారులకు సరుకులను అందించే క్రమంలో నకిలీ బిల్లులు సృష్టించి రూ.102 కోట్లను కాజేశారు. ప్యాకేజీపై పేర్కొన్న చిరునామాలో వినియోగదారుడు లేదని చెబుతూ రవాణా చార్జీలు క్లెయిమ్ చేసుకున్నారు. హైదరాబాద్ ఆఫీసు కేంద్రంగా జరిగిన ఈ మోసంలో సంస్థ సిబ్బందితో పాటు గతంలో పనిచేసి మానేసిన వారి ప్రమేయం కూడా ఉందని అమెజాన్ ప్రతినిధి జీవిఎస్ అర్జున్ కుమార్ ఆరోపించారు. అమెరికాలో సరుకులు సరఫరా చేసే వారితో కలిసి ఈ మోసానికి పాల్పడ్డారని వివరించారు. ఈమేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయగా.. అధికారులు మొత్తం 22 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**కుట్ర చేశారిలా..**

హైదరాబాద్ లో అమెజాన్ రిలే ఆపరేషన్ సెంటర్ ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఏ వస్తువును డెలివరీ చేస్తున్నదీ ఈ సెంటర్ నుంచే పర్యవేక్షిస్తారు. గోడౌన్ నుంచి బయటకు వెళ్లినప్పటి నుంచి ప్యాకేజీ కస్టమర్ కు చేరేవరకు సంస్థ సిబ్బంది కదలికలను జీపీఎస్ ఆధారంగా పర్యవేక్షిస్తుంటారు. ఈ డెలివరీ వ్యవహారాన్ని థర్డ్ పార్టీకి కాంట్రాక్ట్ ఇస్తారు. సంస్థ గోడౌన్ నుంచి కస్టమర్ చిరునామా వరకు దూరాన్ని బట్టి రవాణా ఖర్చును అమెజాన్ చెల్లిస్తుంది. ఒకవేళ కస్టమర్ ఆ సమయంలో ఆ చిరునామాలో లేకుంటే ప్యాకేజీ డెలివరీ చేయకపోయినా రవాణా ఖర్చు చెల్లించాల్సిందే. ఇందులో లొసుగును పసిగట్టిన మాజీ సిబ్బంది కొంతమంది మోసానికి తెరలేపారు. ప్రస్తుతం రిలే సెంటర్ లో పనిచేస్తున్న వారితో పాటు అమెరికాలోని సిబ్బందితో కలిసి నకిలీ ట్రిప్పులను నమోదు చేసి బిల్లులు దండుకున్నారు.

**ఇదీ మోసం..**

వస్తువును డెలివరీ చేయడానికి వెళ్లిన సమయంలో ఆ చిరునామాలో కస్టమర్ లేకపోతే ఆ విషయాన్ని అమెజాన్ సిబ్బంది సంస్థ యాప్ లో నమోదు చేయాలి. దీనిని రిలే సెంటర్ సిబ్బంది నిర్ధారిస్తారు. డెలివరీ కోసం ఎంత దూరం ప్రయాణించారనేది లెక్కగట్టి, దీనికి అయిన ఖర్చును డెలివరీ సంస్థలకు అమెజాన్ చెల్లిస్తుంది. అమెరికాలో వస్తువుల డెలివరీకి వెళ్లకుండానే వెళ్లినట్లు రికార్డు చేసి, చిరునామాలో కస్టమర్ లేదని చెబుతూ రవాణా ఖర్చులను వసూలు చేశారు. ఇలా రూ.102,88,05,418 కొల్లగొట్టారు.

# కాళేశ్వరంపై బీఆర్ఎస్‌వి తప్పుడు వాదనలు

**– జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు జేఏసీ నేత రఘు వాంగ్మూలం**



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసిందని విద్యుత్ జేఏసీ నేత కే రఘు అన్నారు. కాళేశ్వరం కమిషన్ చైర్మెన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని సెంట్రల్ వాటర్ కమిషన్ ఎప్పుడూ చెప్పలేదు. గోదావరి వాటర్ డిస్ట్రిబ్యూట్ ట్రిబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పు ప్రకారం పైరాష్ట్రాలు నీటిని వాడుకున్న తర్వాత 165 టీఎంసీలు అందుబాటులో ఉంటాయని స్పష్టంగా చెప్పింది. కాళేశ్వరం అందుబాటులోకి వచ్చిన ఐదేండ్లలో ఏ సంవత్సరం కూడా 50 టీఎంసీలకు మించి నీరు ఎత్తిపోయలేదు. మహారాష్ట్ర ఒప్పుకున్న 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి నీటిని తరలించవచ్చు. తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 4 మీటర్లు అదనంగా నీటిని ఎత్తిపోస్తే సరిపోతుంది. కాని కాళేశ్వరం నుంచి మూడు దశల్లో 123 మీటర్లు ఎత్తి పోస్తున్నారు. ఫలితంగా రూ.100 కోట్లు కావాల్సిన విద్యుత్ బిల్లులు వేల కోట్లకు చేరుకున్నాయి" అని రఘు జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు లిఖిత పూర్వకంగా ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.లక్ష కోట్లకు పైగా వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టిన నేపథ్యంలో దాన్ని తక్కువ ఖర్చుతో మరమ్మతులు చేసి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నించాలని అన్నారు. అదే సందర్భంలో తుమ్మిడి హెట్టి వద్ద ప్రత్యామ్నాయ ప్రాజెక్ట్ నిర్మించాలని సూచించారు.

# ధరణిపై పోరాడార రైతులకు భూములు ఇప్పించాం

**– కె.రాజయ్య, సీపీఐ(ఎం) కొండాపూర్ మండల కార్యదర్శి**



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి రైతులకు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతులమీదుగా అసైన్డ్ భూములను అప్పటి ప్రభుత్వం ఇచ్చింది. పట్టాలను కూడా అందజేసింది. అయితే గత కేసీఆర్ సర్కారు ధరణి పోర్టల్‌లో ఆ భూములను చూపలేదు. వాటిని పారిశ్రామిక అవసరాలకు కేటాయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం యత్నించింది. స్థానిక నాయకులూ ప్రభుత్వానికి వత్తాసు పలికారు. మేం దీన్ని చూస్తూ ఊరుకోలేదు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులందర్నీ సమీకరించాం. ఎమ్ఆర్ఓ కార్యాలయాన్ని ముట్టడించాం. ఆ తర్వాత పోరాటంలో భాగంగా 12 కిలోమీటర్లు పాదయాత్రగా కలెక్టరేట్‌కు వెళ్లి ధర్నా చేశాం. ఆర్డీఓ, కలెక్టర్‌తో మాట్లాడి రైతుల పేరిట భూములను ఎక్కించి పట్టాలివ్వాలని వాదించాం. పోరాటాలు చేశాం. 97 మందికి పట్టాలిప్పించడంలో విజయం సాధించాం. ధరణిలో ఆ రైతుల పేరిట ఆ భూములను ఎక్కించడంలో సక్సెస్ అయ్యాం. దీంతో రైతులకు, ప్రజలకు సీపీఐ(ఎం)గా మరింత దగ్గరయ్యాం. ఈ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అదే మండలంలోని మాందాపూర్‌లోనూ 327 ఎకరాలకు సంబంధించి 310 మంది రైతులతో భూపోరాటం ప్రారంభించాం. గ్రామసభ పెట్టినట్టు..రైతులు వ్యవసాయానికి ఆ భూములు పనికిరావన్నట్టు రాసినట్టు అధికారులు రికార్డుల్లో రాసి వాటిని పరిశ్రమలకు కేటాయించాలని చూస్తున్నారు. ఇది అన్యాయం. ఏ రైతులు రాసిచ్చారో చూపండి అంటే అధికారులు చూపించట్లేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ పేదలకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. ఇప్పుడు మాట మార్చారు. భూములు కోల్పోతున్న రైతులకు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ప్రచారం చేస్తున్నారు. కొండాపూర్ ప్రాంతంలో దాదాపు 15 పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు సేకరించారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఒక్కరికి కూడా ఇవ్వలేదు. ఆ కంపెనీల్లో స్థానికేతరులే పనిచేస్తున్నారు. ఆ 310 మంది రైతులకు న్యాయం దక్కే దాకా పోరాడుతాం.

# ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి**




సూర్యాపేట: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యల ను పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎన్.సోమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సప్లమెంటరీ బిల్లులైన సంపాదిత సెలవులు, జిపిఎఫ్ రుణాలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పెన్షన్ బకాయిలను వెంటనే ఆర్థికశాఖ ద్వారా క్లియర్ చేయాలని అన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సంబంధించి ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగోన్నతులు కల్పించాలని, జీరో వన్ జీరో వేతనాలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు అమలు చేయాలన్నారు. ప్రీ ప్రైమరీ తరగతు లను అంగన్వాడీల్లో కాకుండా ప్రాథమిక పాఠశాలల్లోనే నిర్వహించాలని సూచించారు. కేజీబీవీ పాఠశాలల ఉపాధ్యాయులకు టైం స్కేల్, వివిధ రకాల సెలవులను వర్తింపజేయా లని అన్నారు. గురుకుల పాఠశాలల్లో పనివేళలను సరిచేయాల న్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.యాకయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కె.అరుణ భారతి, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శి బి.ఆడం, వి.రమేష్, సిహెచ్.రమేష్, డి.లాలు, జి.శోభారాణి, సిహెచ్.వీరారెడ్డి, ఆర్.శీను, పి.అభినవ్, పి.కరుణాకర్ రెడ్డి, పి.నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, ఏ.శీనయ్య, కె.సీనయ్య, కె.రాజన్న, ఎం.వంశీ, ధారభిక్షం, ఆర్.సత్యనారాయణ, కె.ఉదయభాస్కర్, సైదా పాల్గొన్నారు.

# వేరుశనగ రైతుల ఆగ్రహం

**– అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో ఉద్రిక్తత**

**– వ్యాపారులు, ఏజెంట్లు దోచుకుంటున్నారని ఆగ్రహం**

**– కార్యాలయంలో ఫర్నీచర్ ధ్వంసం**




అచ్చంపేట: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో వేరుశనగ రైతుల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కలిసి దోచుకుంటున్నారని, తక్కువ ధరకు పంట కొనుగోలు చేస్తున్నారంటూ ఆందోళన చేశారు. మార్కెట్ చైర్మెన్, అధికారులు వ్యాపారులకు సహకరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయంలోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ నర్సింహులు, చైర్‌పర్సన్ భర్త మల్లేష్‌తో వాగ్వాదం.. తోపులాట జరిగింది. ఈ క్రమంలో చైర్‌పర్సన్ రజిత భర్త చొక్కా చినిగిపోయింది. క్వింటాల్ వేరుశనగ పంటకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7200 ధర ఉండగా.. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై రూ.4500 నుంచి 6500 మాత్రమే ధర పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టం చేసి పంట పండిస్తే దోచుకుంటున్నారని, వేరుశనగ పంట విత్తనాలు క్వింటాకు రూ.14వేలు కొని సాగు చేస్తే.. పంటకు రూ.4 వేలు, 5వేలు ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్, సిబ్బందితో కలిసి మార్కెట్‌కు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులను కార్యాలయం నుంచి బయటకు పంపించి తాళం వేశారు. రైతులు ఆవేశాలకు పోయి నష్టపోవద్దని సూచించారు. దాంతో రైతులు అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైటాయించారు.

# మెరుపులేని మిరప

**– దిగుబడి వస్తున్న కొద్దీ ధరల పతనం**

**– ఏటేటా..నెలనెలా తగ్గుతున్న రేట్లు**

**– ఎకరాకు రూ.2.50 లక్షల పెట్టుబడి..**

**– అదీ రావట్లే**

**– గరిష్టం 25 క్వింటాళ్ల ఉత్పత్తి ధర రూ.12వేల లోపే**




ఖమ్మం: సరైన ధరలు లేక మిర్చి రైతులు అల్లాడుతున్నారు. ఏటేటా మిర్చి రేట్లు పడిపోతుండగా ఈ సీజన్‌లో నెలనెలా పతనం అవుతున్నాయి. రాష్ట్రంలోని పేరుమోసిన మిర్చి మార్కెట్లు వరంగల్, ఖమ్మంలో మూడేండ్ల క్రితం తేజా రకం మిర్చి ధరలు రికార్డుస్థాయిలో క్వింటాల్ రూ.25వేలకు పైగా ధర పలికాయి. 2022లో వరంగల్ మార్కెట్‌లో చపాట రకం మిర్చి ధర ఏకంగా రూ.96వేల రికార్డు స్థాయి ధర పలికింది. 2023 మార్చిలో తేజా రకం మిర్చి ధర ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.25,550 నమోదైంది. నాటి నుంచి క్రమేణా క్షీణిస్తున్నాయి. 2023 ఏప్రిల్‌లో రాష్ట్రంలోని పలు మార్కెట్లలో క్వింటాల్ రూ.23వేలకు పైగా పలికిన మిర్చి ధరలు, 2024లో మరింతగా తగ్గాయి. 2024 అక్టోబర్ 3వ తేదీన రూ.20వేలకు పైన ఉన్న మిర్చి ధరలు నెలనెలా తగ్గుతున్నాయి. పంట దిగుబడులు మార్కెట్‌కు వస్తున్న కొద్దీ ధరల్లో క్షీణత చోటుచేసుకుంటోంది.

**నెలనెలా తగ్గుతున్న ధరలు..**

ఈ సీజన్‌లో మిర్చి ధరలు నెలనెలా తగ్గుతున్నాయి. మార్కెట్‌కు సరుకు వస్తున్న కొద్దీ రేటులో మందగమనం నెలకొంటోంది. ఈ సీజన్‌లో 2024 అక్టోబర్ 3వ తేదీన క్వింటాల్ మిర్చి రూ.20వేలు పలకగా, నవంబర్ 3న రూ.18,300, అదే నెల 26వ తేదీ నాటికి రూ.16,500, డిసెంబర్ 18న రూ.16,200 ఉన్న ధర ఆ నెల 31న రూ.15,511కు పడిపోయింది. ఈ ఏడాది జనవరి 6న రూ.15,800 ఉన్న ధర 16వ తేదీ నాటికి రూ.14వేలకు క్షీణించింది. ఇక సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు 37,306 బస్తాల మిర్చి రాగా గరిష్ట ధర కేవలం రూ.14,800 పలికింది. ఎక్కువ మొత్తం పంటను రూ.13వేల కన్నా తక్కువకే కొనుగోలు చేశారు. కొత్త మిర్చి వస్తుండటంతో నిల్వ చేసిన ఏసీ మిర్చి ధరలు మరింతగా తగ్గుతున్నాయి. ఏసీ తేజా రకం మిర్చికి 27వ తేదీన రూ.12వేల గరిష్ట ధర పలకటం గమనార్హం.

**అనుమతులు లేకనే..!**

రాష్ట్రవ్యాప్తంగా తేజా రకం మిర్చి ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో మాత్రమే ఎక్కువగా సాగు చేస్తారు. ఈ రకం ఘాటైనది కావడంతో 90శాతానికి పైగా పంట చైనా, థారులాండ్, బ్యాంకాక్, సింగపూర్ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుంది. సాధారణ రకం పంటను ఇక్కడే ప్రాసెసింగ్ చేసి వినియోగంలోకి తెస్తారు. ఖమ్మం మార్కెట్‌కు జిల్లా రైతులతో పాటు పొరుగు జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, ఏపీలోని కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి రైతులు సరుకు తీసుకొస్తారు. గతేడాది సీజన్‌లో క్వింటాకు రూ.22వేలు పలికిని మిర్చి ధర ఈ ఏడాది సీజన్ ప్రారంభం నాటికి గణనీయంగా పడిపోయింది.

# రువాండా రెబల్స్ కాల్పులు : 17 మంది మృతి

హైదరాబాద్ : తూర్పు కాంగోలోని అతిపెద్ద నగరం గోమాలో రువాండ మద్దతుగల ఎం23 తిరుగుబాటుదారులు కాల్పులు జరిపారు. ఈ తిరుగుబాటుదారులకు, సైన్యం ప్రభుత్వ అనుకూల మిలిషియాలు కూడా వారిపై ఎదురుదాడికి పాల్పడ్డారు. రువాండా ఎం23 తిరుగుబాటుదారుల కాల్పుల్లో దక్షిణాఫ్రికాకు చెందిన శాంతి పరిరక్షకులు నలుగురు మృతి చెందారు. ఈ కాల్పుల వల్ల ఇప్పటివరకు దాదాపు 17 మంది మృతి చెందారని ఐక్యరాజ్యసమితి అధికారి ఒకరు తెలిపారు.కాగా, రువాండా రెబల్స్ కాంగోలోని సహజవాయువుల నియంత్రణ కోసం తిరుగుబాటు చేస్తున్నారు. ఈ తిరుగుబాటు 2012 నుంచి సాగుతుంది. కాంగోనగరానికి దాదాపు రెండు మిలియన్ల తిరుగుబాటుదార్లు చేరుకున్నారని మీడియా పేర్కొంది. రువాండా రెబల్స్‌కి డజన్లకొద్దీ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో దళాలు లొంగిపోయాయి.

# భూ కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

## -ఏకశిలా నగర్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

హైదరాబాద్: నకిలీ పత్రాలు సృష్టించి తమ స్థలాలను అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఏకశిలా నగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు జుబేర్ అక్రమ్, రామ్ రెడ్డి, చెరుకు శివారెడ్డి, ముత్తారెడ్డి లు మాట్లాడారు. మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ మండలం కొర్రెముల గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 739 నుంచి 749 లో గల స్థలాలను 1985 సంవత్సరం లో వెంచర్ చేయగా వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు నిర్వహించిన తాము కొనుగోలు చేసినట్లు చెప్పారు. సదరు భూమిపై కన్నేసిన కబ్జాదారులు నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి స్థానిక అధికారులను ప్రలోభాలకు గురిచేసి తమ భూములను వ్యవసాయ భూములుగా చూపుతూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. దీంతో తాము రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా తమకు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. న్యాయస్థానం ఆదేశాలను సైతం బే ఖాతరు చేస్తూ తమ స్థలాల్లోకి తమను వెళ్లకుండా గుండాలచే అడ్డుకుంటున్నారని వాపోయారు. కష్టార్జితంతో కొనుగోలు చేసిన స్థలంలో ఇళ్లను నిర్మించుకుంటే భారీ జెసిబి లతో నిలవటం చేశారని విలపించారు. పేద మధ్యతరగతి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎంపీ ఈటెల రాజేందర్ అక్కడికి వచ్చారని చెప్పారు. విషయాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా ప్రజా ప్రతినిధి అని కూడా చూడకుండా మాట్లాడుతుండడంతో వారించే ప్రయత్నంలోనే ఘర్షణ చోటుచేసుకుందని అన్నారు. వెయ్యి మందికి పైగా బాధితులు ఉన్న ఈ అంశంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముత్తారెడ్డి శ్రీనివాస్ వెంకటేష్ నిర్మల కళ్యాణి రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత
## తాండూర్ సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్



తాండూర్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరుతూ ట్రాఫిక్ నిబంధనలపై తాండూర్ సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ అవగాహన కల్పించారు. ఐ.బి కేంద్రంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవల్లో భాగంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను లైసెన్స్ ఇన్సూరెన్స్ తప్పకుండా కలిగి ఉండాలని తెలిపారు. అలాగే మైనర్లకు వాహనాలను ఇవ్వవద్దని నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడుపవద్దని అలా చేసినట్లయితే కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆటో డ్రైవర్లు మితిమీరి ప్రయాణికులను ఎక్కించరాదని నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదని హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు .అలాగే ఐబీ కేంద్రంలో శనివారం అంగడి బజార్ నుండి తాండూర్ బస్టాండ్ వరకు రహదారి ప్రక్కన ఉన్న దుకాణం యజమానులందరూ రోడ్డుకు అడ్డంగా వాహనాలను నిలుపకుండా చూడాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# కరీంనగర్ లో రియల్ ఆశలు,,,

కరీంనగర్: రియల్ ఎస్టేట్) వ్యాపారం రోజు రోజుకూ పుంజుకుంటోంది. ఒకప్పుడు వేలల్లో పలికిన భూముల ధరలు మొన్నటి వరకు లక్షలు, కోట్లు పలికాయి. దీంతో చాలా మంది భూమిపై పెట్టిన పెట్టుబడి ఏడాది రెండేళ్లకే రెట్టింపు కావడంతో చాలా మంది రియల్ ఎస్టేట్లో పెట్టుబడి పెట్టారు. అయితే ఏడాది కాలంగా రియల్ వ్యాపారం బాగా తగ్గింది. గతంలో లక్షలు పెట్టి కొన్న భూములు అమ్ముడు పోకపోవడంతో పెట్టుబడులు స్ట్రక్ అయ్యాయి. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ధర తక్కువగా ఉన్నప్పుడు పెట్టుబడి పెట్టి.. ధరలు పెరిగినప్పుడు అమ్మితే మంచి లాభాలు వస్తాయి. రియల్ ఎస్టేట్ ఎప్పుడూ ఒకే రకంగా ఉండదు. ప్రస్తుతం కరీంనగర్లో ఇదే పరిస్థితి ఉంది. ఏడాది క్రితం వరకు భారీగా ధర పలికిన భూములను ఇప్పుడు మార్కెట్లో కొనేవారు కరువయ్యారు. దీంతో పట్టుబడిదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే ధర తక్కువ ఉన్నప్పుడు పెట్టుబడి పెట్టిన వారికి ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ, ఇంకా పెరుగుతుందని భారీగా డబ్బులు పెట్టి కొన్నవారే ఇబ్బంది పడుతున్నారు. కరీంనగర్లో రియల్ ఎస్టేట్లో పెట్టుబడికి ఇది మంచి సమయం అంటున్నారు మార్కెట్ నిపుణులు. కొంతకాలంగా అంతటా లావాదేవీలు తగ్గిపోయాయి. కొత్త జిల్లా విభజన తర్వాత కృత్రిమమైన హైప్రావడంతో పెద్ద ఎత్తున ధరలు పెంచారు. దీంతో చాలా మంది పెట్టుబడులు పెట్టారు. అవన్నీ ఇప్పుడు రీ సేల్ కావడం లేదు. పెట్టుబడి డబ్బులు స్ట్రక్ అయ్యాయి. అలాగని నష్టానికి అమ్ముకోలేని పరిస్థితి. మరోవైపు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినవారు వడ్డీలు పెరుగుతుండడంతో ఆందోళన చెందుతుఅన్నరు. దీంతో కొందరు వ్యాపారులు ఇళ్లు, భూములు, ప్లాట్స్ అమ్మేందుకు రేట్లు తగ్గించేందుకు సిద్ధపడ్డారు. దీంతో ఇప్పుడు పెట్టుబడి పెడితే మంచిదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కరీంనగర్ పట్టణం విస్తృతంగా అభివృద్ధి చెందడానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. వచ్చే మూడు నాలుగేళ్లలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎవరూ ఊహించనంతగా అభివృద్ధి చెందుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయతే రెండేళ్ల క్రితమే గరిష్ట ధరలు ఉన్న భూములను ఇప్పుడు ఆ ధరకు కూడా కొనుగోలు చేసేవారు లేరు. ఈ తరుణంలో అమ్మేవారి నుంచి కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు అంటున్నారు. ఇప్పుడు పెట్టుబడి పెడితే నాలుగేళ్ల తర్వాత మంచి ధర వస్తుందని అంటున్నారు. అందుకే ఇప్పుడు కరీంనగర్లో పెట్టుబడి పెట్టడం మంచిదని పేర్కొంటున్నారు.

# బీసీ మంత్రంపైనే బీజేపీ ఆశలు

హైదరాబాద్: సౌత్పై పట్టుకోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ సమయంలోనే తెలంగాణ బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపిక తెరపైకి వచ్చింది. చాలామంది నేతలు అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. కాషాయ పార్టీ అధిష్టానం మాత్రం ఈటెల రాజేందర్ వైపే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. రాజకీయ వ్యూహాలు రచించడం, వాటిని పకడ్బందీగా అమలు చేయడంలో ప్రస్తుత బీజేపీ పెద్దలు ఎక్స్పర్ట్స్. బీజేపీ ఓ ప్లాన్ చేస్తుంది.. దానికి కౌంటర్ ఇవ్వాలనే ఆలోచన కూడా రాజకీయ ప్రత్యర్థులకు రాకుండా జాగ్రత్తపడతారు. గతంలో అలా ఎన్నో వ్యూహాలు రచించి అమలు చేశారు. రాజకీయ లబ్ధి పొందారు. వేరే రాష్ట్రాల సంగతి ఎలా ఉన్నా.. ఇప్పుడు బీజేపీ పెద్దల దృష్టి తెలంగాణపై పడింది. రాష్ట్రంలో పట్టుకోసం కమల దళం ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త అధ్యక్షుడి ఎంపిక అంశం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కిషన్ రెడ్డి ఉన్నారు. అటు కేంద్రంలోనూ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ రెండు బాధ్యతలతో కిషన్ రెడ్డికి పని భారం పెరుగుతోంది. దీంతో తెలంగాణ బీజేపీ కొత్త సారథిని నియమించాల్సి వస్తోంది. అయితే.. అధ్యక్ష పదవి కోసం చాలామంది నేతలు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవారు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు ప్రెసిడెంట్ పోస్టు కోసం పోటీ పడుతున్నారు. కానీ.. బీజేపీ పెద్దలు మాత్రం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ వైపే మొగ్గు చూపుతున్నట్టు పొలిటికల్ సర్కిల్లో చర్చ జరుగుతోంది. ఈటెల రాజేందర్ తెలంగాణ రాజకీయాల్లో పరిచయం అక్కర్లేని నేత. తెలంగాణ ఉద్యమంలో ఈటెల పాత్ర మరువలేనిది. తొలి తెలంగాణ ప్రభుత్వంలో ఈటెల మంత్రిగా పనిచేశారు. రెండోసారి కూడా కేసీఆర్ మంత్రివర్గంలో కీలక శాఖలు నిర్వహించారు. అన్ని పార్టీల నేతలతో ఈటెలకు మంచి సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలతోనూ సత్సంబంధాలు ఉన్నాయి. వివాదాలకు దూరంగా ఉంటారనే పేరుంది. ఏ విషయంపై అయినా జాగ్రత్తగా మాట్లాడతారు. అందుకే బీజేపీ ఈటెల వైపు మొగ్గుచూపుతోందని తెలుస్తోంది. బీజేపీ తెలంగాణలో బీసీ మంత్రాన్ని నమ్ముకున్నట్టు తెలుస్తోంది. అందుకే ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన ఈటెలకు బాధ్యతలు అప్పగిస్తే.. రాజకీయంగా లబ్ధి జరగవచ్చని కమలం పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. అంతేకాకుండా ఈటెల సతీమణిది రెడ్డి సామాజికవర్గం. ఇది కూడా తమకు కలిసొస్తుందని బీజేపీ నమ్ముతున్నట్టు తెలుస్తోంది. అటు ఇతర బీసీ కులాల్లోనూ ఈటెలకు మంచి ఫాలోయింగ్ ఉంది. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకోవాలని కాషాయదళం భావిస్తున్నట్టు బీజేపీలో చర్చలు జరుగుతున్నాయి. ఇటీవల కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొత్త అధ్యక్షుడి ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడు కావాలంటే ఆర్ఎస్ఎస్ నేపథ్యం అవసరం లేదని స్పష్టం చేశారు. ఆయన చేసిన ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఈటెలను దృష్టిలో పెట్టుకొనే ఈ వ్యాఖ్యలు చేసినట్టు చర్చ జరిగింది. అటు బీజేపీలో ప్రస్తుతం నంబర్ 2గా ఉన్న అమిత్ షా.. ఈటెల రాజేందర్ పట్ల సానుకూలంగా ఉన్నట్టు తెలిసింది. వేరే నాయకులతో పోలిస్తే.. ఈటెల కు బాధ్యతలు అప్పగిస్తే లాభం జరగవచ్చని బీజేపీ భావిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి రేసులో ముగ్గురు నేతలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. షార్ట్ లిస్ట్లో ఈటెల రాజేందర్, డీకే అరుణ, రామచంద్రరావు పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు.. రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రాజాసింగ్, చింతల రామచంద్రారెడ్డి కూడా అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్టు ప్రచారం జరిగింది.

# కళాతోరణానికి అంతా రెడీ

వరంగల్: వరంగల్ కాకతీయ కళాతోరణం.. తెలంగాణ చరిత్రలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ అద్భుత నిర్మాణం కేవలం ఒక కట్టడం మాత్రమే కాదు.. కాకతీయ రాజవంశం ఘన చరిత్ర, కళాత్మక నైపుణ్యం, శిల్పకళా వైభవానికి నిదర్శనం. అంతటి ప్రాధాన్యం గల కాకతీయ కళాతోరణం గురించి 7 ఆసక్తికరమైన విషయాలు ఇలా ఉన్నాయి. వరంగల్ కాకతీయ కళాతోరణం..12వ శతాబ్దంలో కాకతీ య రాజుల కాలంలో నిర్మించారు. ఈ కళాతోరణం వరంగల్ కోటలోని శివాలయానికి ప్రవేశ ద్వారంగా ఉండేది. కాకతీయ రాజులు తమ శక్తి, సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఈ అద్భుతాన్ని నిర్మించారు. వరంగల్ కోట నాలుగు దిక్కులా ఉన్న ప్రధాన ద్వారాలను కలుపుతూ..గణపతి దేవుడు ఖిల్లా వరంగల్ చుట్టూ 15 మీటర్ల ఎత్తయిన రాతి గోడను నిర్మించారు. ఈ గోడపై బురుజులు కూడా ఉన్నాయి. ఈ ద్వారాలను కాకతీయ కళాతోరణాలు, కీర్తి తోరణ శిల్పాలుగా పిలుస్తు న్నారు. కాకతీయ కళాతోరణాలు కేవలం అలంకారం కోసం చేసిన డిజైన్ కాదు. దాని మీద కాకతీయుల పాలనా వైభవమంతా పూసగుచ్చి నట్టుగా ఉంటుంది. వాళ్ల ఏలుబడిలో ఏయే అంశాలకు ప్రాధాన్యమి చ్చారో ఈ తోరణాలు తెలియజేస్తాయి. నిలబడ్డ నాలుగు పిల్లర్లు వాళ్ల పాలనలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచిందనడానికి నిదర్శనం. హంసలు, మొసళ్లు, పద్మాలు, మొకలు, తలకిందులుగా వేలాడినట్టుండే తామెర మొగ్గల వంటి ఆకృతులు.. ఇలా ఎన్నో అంశాల కలబోత వరంగల్ కాకతీయ తోరణాలు. ఈ శిల్పాలు కాకతీయ శిల్పుల కళా నైపుణ్యానికి నిదర్శనంకాకతీయుల ధైర్య సాహసాలకు నిదర్శనంగా ఈ కళాతోరణాలు నిలుస్తాయి. ఢిల్లీ సుల్తానులపై కాకతీయ సేనలు చేసిన యుద్ధం గురించి.. గొడిశాలలో ఉన్న కాకతీయుల కళాతోరణం తెలుపుతోంది.

# రిటైర్మెంట్ మళ్లీ.... పెంచుడేనా

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త టెన్షన్ పట్టుకుంది. ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సును మళ్లీ పెంచే ఆలోచన చేస్తుందనే టాక్ ప్రభుత్వ ఆఫీసుల్లో బిగ్ సౌండ్ చేస్తుంది. పరిస్థితి చూస్తుంటే నిజమే కావొచ్చనే అనుమానాలు కలుగుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగుల అంశం తెలంగాణ ప్రభుత్వానికి భారంగా మారిపోయింది. ఇప్పటికే రేవంత్ సర్కార్.. ఆర్థిక కష్టాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఆరు గ్యారెంటీలకు, సంక్షేమ పథకాలకు నిధుల కొరత వేధిస్తోంది. వీటికి తోడు అప్పులకు చెల్లిస్తున్న వడ్డీలు తడిసి మోపెడు అవుతున్నాయట. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు ఇప్పుడు ఉద్యోగుల రిటైర్మెంట్ అంశం కూడా సర్కార్కు సవాల్గా మారిందని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి సుమారు 8వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ కాబోతున్నారు. అంతే కాదు వచ్చే నాలుగేళ్లలో సుమారు 38 వేల మందిపైగా ఉద్యోగ విరమణ స్టేజ్లో ఉన్నారట. అయితే వీరందరికి బెనిఫిట్స్ చెల్లించడం సర్కార్కు పెను భారమనే చర్చ జరుగుతోంది.. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత సర్కార్ చెల్లించాల్సిన బెనిఫిట్స్ చాలానే ఉంటాయి. వారి మూల వేతనం ప్రకారం ఊఖీం, అఅం, ఆంలను కలుపుకొని మొత్తం వేతనానికి 10 రెట్లు లీవ్ శాలరీ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున 30 నుంచి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఈ మార్చి చివరి నాటికి 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ కానున్నారని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. 2025 డిసెంబర్ నాటికి సుమారు 10 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో 2026, 2027 లోనూ దాదాపు 10 వేల మంది చొప్పున ఉద్యోగులు రిటైర్ కానున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2028లో మరో 8 వేల మంది విరమణ చేస్తారు. వీరందరికి బెనిఫెట్స్ చెల్లించాలంటే ప్రభుత్వానికి అదనంగా ప్రతి ఏడాది సుమారు 5వేల కోట్ల రూపాయలు ఖచ్చితంగా అవసరమవుతాయి. అంటే నెలకు తక్కువలో తక్కువ 400 కోట్లు ఉద్యోగ విరమణ చేసే ఉద్యోగులకే కేటాయించాలన్నమాట. గత ఏడాది రిటైర్మెంట్ అయిన ఉద్యోగులతో పాటు, ఈ ఏడాది రిటైర్ అవుతున్న ఉద్యోగులకు దాదాపు 3వేల 200 కోట్ల రూపాయల వరకు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు అధికారులు. అసలే ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రభుత్వం రిటైర్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించే పరిస్థితుల్లో లేదని సచివాలయ వర్గాలు చెబుతున్నాయిఐతే ఇదంతా బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమే అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల ఏజ్ లిమిట్ను గత ప్రభుత్వం పెంచింది. ప్రభుత్వ ఉద్యోగ విరమణ వయస్సును 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచారు. 2021లో తీసుకున్న ఈ నిర్ణయంతో 2024 మార్చి 31 వరకు తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్లు దాదాపు జరగలేదు. దీంతో గత ప్రభుత్వం వీరికి ఎలాంటి చెల్లింపులు చేయాల్సిన అవసరంరాలేదు. ఇక రేవంత్ సర్కార్ వచ్చిన 3 నెలల నుంచే పదవీ విరమణలు మొదలవ్వడంతో ఒక్కసారిగా భారం పడుతోంది. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ పే చేయడం సర్కార్కు సవాల్గా మారిందట. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం వచ్చే నాలుగేళ్ల కాలంలో 20వేల కోట్ల రూపాయల భారం పడొచ్చని అంచనా వేస్తోంది ఆర్థిక శాఖ. ఈ భారం నుంచి తప్పించుకునేందుకు ఈ ప్రభుత్వం కూడా రిటైర్మెంట్ ఏజ్ను పెంచే ఆలోచన చేస్తోందని టాక్ వినిపిస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్లో ఉద్యోగుల రిటైర్మెంట్ ఏజ్ 62 ఏళ్లుంటే.. తెలంగాణలో 61 ఏళ్లుగా ఉంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంచితే ఎలా ఉంటుందనే ప్రతిపాదినను పరిశీలిస్తోందటఐతే పదవీ విరమణ వయస్సుపెంపుతో ఉద్యోగుల్లోనూ పని చేసే శక్తి ఉండదని టాక్ కూడా వినిపిస్తోంది. ఆరుపదుల వయస్సు దాటినా..సేవలు అందిం చడం కష్టమే అంటున్నారు. ఇటు ప్రభుత్వ ఆలోచనను నిరుద్యోగు లు, ప్రతిపక్షాలు సైతం తప్పుబడుతున్నాయి. దీంతో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ను బాండ్స్ లేదా మంత్లీ ఇన్స్టాల్మెంట్ రూపంలో చెల్సించే అవకాశాలను సైతం తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఉద్యోగ విరమణ వయస్సుపై సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది అటు ఉద్యోగుల్లో, ఇటు నిరుద్యోగుల్లో ఉత్కంఠగా మారింది.

# ఆ గ్రామంలో మందు బ్యాన్

నిజామాబాద్: "తెలంగాణలో మందు తాగటమంటే.. అదేదో వ్యసనం కాదు.. అలవాటుపడిన సంప్రదాయం.." అని ఓ సినిమాలో హీరో డైలాగ్ చెప్తాడే కానీ.. నిజానికి చాలా ప్రాంతాల్లో మద్యానికి బానిసలై చాలా మంది తమ జీవితాలు నాశనం చేసుకుంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. పండుగకో పబ్బానికో ఆనందంగా ఉన్నప్పుడో బాధ పలకరించినప్పుడు.. స్నేహితుడు కలిశాడనో.. ఇలా కొన్ని సందర్భాలున్నప్పుడు తాగితే ఓకే కానీ.. తాగేందుకే సందర్భాలు క్రియేట్ చేసుకుంటుంటారు కొందరు. మరికొందరికైతే.. సందర్భమూ అవసరం లేదు.. సోపతీ అక్కర్లేదు.. మందు తాగాలన్న యావ ఒక్కటే. అలాంటి వాళ్లు ఎంతో మంది.. తాగి తాగి వారి లివర్లను పాడు చేసుకోవటమే కాదు.. జీవితాలను కూడా రోడ్డున పడేస్తున్నారు. ఈ క్రమంలో.. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పోతాయిపల్లి గ్రామస్థులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. పోతాయిపల్లి గ్రామస్థులు తమ గ్రామంలో మద్యనిషేధం విధిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో బెల్టుషాపులు ఎక్కువటం వల్ల యువకులు, రైతుకూలీలు మద్యానికి బానిసలై ఆర్థికంగా నష్టపోతున్నారని.. కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్న విషయాలను పరిగణలోకి తీసుకుని.. మద్యనిషేధం విదిస్తున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ మద్యనిషేధ తీర్మానం.. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమల్లోకి రానుందని తెలిపారు. అయితే.. ఫిబ్రవరి ఒకటో తారీఖు నుంచి గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే వారికి రూ.60 వేల జరిమానా విధిస్తామని తీర్మానం చేశారు. అంతే కాదండోయ్.. మద్యం విక్రయిస్తున్న వారిని గుర్తించి గ్రామపెద్దలకు సమాచారమిచ్చిన వారికి.. రూ.10 వేల నజరానా కూడా అందించనున్నట్టు ప్రకటించారు. కేవలం తమ గ్రామంలో మద్యనిషేధమే కాదు.. సమీప గ్రామాలకు చెందిన వ్యక్తులు పోతాయిపల్లితో పాటు గ్రామ శివార్లలో మద్యం సేవించటాన్ని కూడా అంగీకరించమని తెలిపారు. అలా ఎవరైనా మద్యం సేవిస్తే వారికి కూడా రూ.5 వేల జరిమానా వేయాలని తీర్మానించారు. తీర్మానం అయితే.. వినేందుకు బాగానే ఉంది కానీ.. అమలు ఎలా జరుగుతుందన్నది చూడాలి. ఇలా గతంలోనూ చాలా గ్రామాల్లో మద్యనిషేధ తీర్మానాలు చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితే.. తీర్మానం చేసిన కొన్ని రోజులు చాలా సీరియస్గా తీసుకుని ఎవ్వరూ మద్యాన్ని ముట్టకుండా జాగ్రత్తగా ఉంటారు. కానీ.. కొద్దిరోజుల తర్వాత మందుబాబులు మెల్లిగా.. తమ పని తాము కానిచ్చేస్తుంటారు. ఊర్లో అమ్మకుండా అయితే జాగ్రత్తలు తీసుకుంటారు కానీ.. తాగకుండా ఎవరు మాత్రం ఎలా ఆపగలరు. గ్రామపెద్దలో, ఇంకెవరో ఎంత చెప్పినా, ఇంకెంత కట్టడి చేసినా.. మనలో ఆ మార్పు వచ్చే వరకు ఎలాంటి లాభం ఉండదు. పట్టి పట్టి పంగనామాలు పెడితే.. పక్కకుపోయి తుడిచేసుకున్నారన్న సామెతలా మారిపోతుంది.

# అమల్లోకి ప్రత్యేక అధికారుల పాలన

వరంగల్: తెలంగాణలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలక మండళ్ల పదవీ కాలం జనవరి 26తో ముగిసింది. దీంతో.. ఆయా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారుల్ని నియమిస్తు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో.. నుంచి వీటిలో ప్రత్యేక అధికారుల పరిపాలనలోకి వెళ్లనున్నాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ విడుదల చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఈ వివరాల్ని వెల్లడించింది. దీని ప్రకారం..2020లో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవీ కాలమైన ఐదేళ్లు పూర్తయ్యింది. వాస్తవానికి ఐదేళ్ల పదవీ కాలం ముగియడానికి ముందే స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహించి, నూతన పాలక వర్గాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ వివిధ కారణాలతో ప్రభుత్వ ఇప్పటి వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. దాంతో.. ఆయా పాలక వర్గాల స్థానాల్లో ప్రత్యేక అధికారుల్ని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు.. జనవరి 26తో 129 మున్సిపాలిటీలకు పదవీ కాలం ముగిసింది. రెండు రోజుల తర్వాత అంటే 28 జనవరి నాటికి కరీంనగర్ కార్పొరేషన్ పాలక వర్గం పదవీ కాలం ముగిసిపోనుంది. ప్రస్తుతానికి వీటి పరిపాలనను ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోకి వెళ్లనుండగా, కొత్త పాలక మండళ్లు ఏర్పడే వరకు వీరు నేతృత్వం వహించనున్నారు. ఇందుకోసం.. 128 మంది ప్రత్యేక అధికారుల్ని ప్రభుత్వం ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించింది. కాగా.. నర్సాపూర్ మున్సిపాలిటీని మంచిర్యాల, కొత్తపల్లి మున్సిపాలిటీని కరీంనగర్ మున్సిపాలిటీలో విలీనం చేయడం ద్వారా రెండు స్థానాలు తగ్గిపోయినట్లు వెల్లడించింది.

# ఉత్తమ పని తీరుకు నిదర్శనం..

## - గ్రేడ్ వన్ కార్యదర్శి కిషన్ రావుకు ప్రశంస పత్రం ..



డిచ్ పల్లి: డిచ్ పల్లి మండల కేంద్రంలోని నడ్పల్లి గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు చేతుల మీదుగా బెస్ట్ పర్ఫార్మెన్స్ కనబరిచి నందుకుగాను ప్రశంసా పత్రంను అందుకున్నారు. ఈ సందర్భంగా నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు "నవ తెలంగాణ"తో మాట్లాడుతూ.. ఈ ప్రశంస పత్రం తో మరింత బాధ్యతను పెంచిందని గ్రామ పంచాయతీ పరిధిలో పచ్చదనం పరిశుభ్రత, 100% ఇంటి పన్నుల వసూలు, మురుగు కాలువల పరిశుభ్రత తదితర వాటిపై గ్రామ ప్రజల సహకారంతో గ్రామ పంచాయతీ పరిధిలో రహదారులపై చేత్త చేదరం, మొక్కల సంరక్షణకు చర్యలు చేపడతానన్నారు. ప్రశంసా పత్రం లాబించడంతో గ్రామపంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నిట్టు కిషన్ రావుకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

# అండర్-19 మహిళల వరల్డ్ కప్:

## తెలుగుమ్మాయి త్రిష వరల్డ్ రికార్డ్

**- మలేసియాలో అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్**
**- నేడు టీమిండియా-స్కాట్లాండ్ మ్యాచ్**
**- 20 ఓవర్లలో 1 వికెట్ కు 208 పరుగులు చేసిన టీమిండియా**
**- 59 బంతుల్లో 110 పరుగులు చేసిన త్రిష**




అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో తొలి సెంచరీ సాధించిన బ్యాటర్ గా రికార్డ్ మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న అండర్-19 మహిళల టీ20 వరల్డ్ కప్ లో టీమిండియా జోరు కొనసాగుతోంది. స్కాట్లాండ్ తో మ్యాచ్ లో టీమిండియా 20 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష మెరుపు సెంచరీతో వరల్డ్ రికార్డు సృష్టించింది. త్రిష టీ20 అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలోనే తొలి సెంచరీ సాధించిన బ్యాటర్ గా నిలిచింది. తెలంగాణలోని భద్రాచలంకు చెందిన త్రిష నేటి మ్యాచ్ లో 53 బంతుల్లో సెంచరీ సాధించింది. త్రిష మొత్తం 59 బంతులు ఎదుర్కొని 13 ఫోర్లు, 4 సిక్సులతో అజేయంగా 110 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ లో త్రిష ఓపెనర్ గా బరిలో దిగింది. మరో ఓపెనర్ కమలిని 42 బంతుల్లో 9 ఫోర్లతో 51 పరుగులు చేసింది. ఈ టోర్నీలో టీమిండియా అమ్మాయిలు ఇప్పటికే సెమీస్ చేరుకున్నారు. ఇవాళ స్కాట్లాండ్ తో జరుగుతున్న మ్యాచ్ సూపర్ సిక్స్ దశలో చివరిది. 209 పరుగుల లక్ష్యఛేదనలో స్కాట్లాండ్ విలవిల్లాడుతోంది. 10 ఓవర్లు ముగిసేసరికి 7 వికెట్లు చేజార్చుకుని 43 పరుగులు చేసింది. భారత బౌలర్లలో ఆయుషి శుక్లా 3, వైష్ణవి శర్మ 3 వికెట్లు తీశారు.

# వరల్డ్ రికార్డ్‌పై కన్నేసిన అర్ష్‌దీప్ సింగ్!



టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను వరల్డ్ రికార్డ్ ఊరిస్తోంది. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో టీమిండియా ప్రధాన పేసర్‌గా సత్తా చాటుతున్న అర్ష్‌దీప్ సింగ్.. మంగళవారం జరిగే మూడో టీ20లో రెండు వికెట్లు తీస్తే అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున 100 వికెట్ల మైలురాయి అందుకున్న తొలి భారత బౌలర్‌గా నిలవనున్నాడు. అంతేకాకుండా అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన తొలి పేసర్‌గా చరిత్రకెక్కనున్నాడు. ఈ క్రమంలో అతను పాకిస్థాన్ పేసర్ హ్యారీస్ రౌఫ్ రికార్డ్‌ను అధిగమించనున్నాడు. రాజ్‌కోట్ వేదికగా జరిగే మూడో టీ20.. అర్ష్‌దీప్ సింగ్‌కు కెరీర్‌లో 62వ మ్యాచ్. ఇప్పటి వరకు అతను 62 టీ20ల్లో 98 వికెట్లు పడగొట్టాడు. గత రెండేళ్లుగా అర్ష్‌దీప్ సింగ్ నిలకడగా రాణిస్తున్నాడు. హ్యారీస్ రౌఫ్ 72 మ్యాచ్‌ల్లో 100 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024లో కెనడాతో జరిగిన మ్యాచ్‌లో హ్యారీస్ రౌఫ్ ఈ ఫీట్ సాధించాడు. ఈ జాబితాలో అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టాప్‌లో కొనసాగుతున్నాడు. అతను 53 మ్యాచ్‌ల్లోనే 100 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. 2021లోనే పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనే అతను ఈ ఫీట్ సాధించాడు. సందీప్ లామిచ్చనే 54 మ్యాచ్‌ల్లో ఈ ఫీట్ సాధించాడు. గతేడాది బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌ల్లో ఈ ఘనతను అందుకున్నాడు. వానిందు హసరంగా 63 మ్యాచ్‌ల్లో 100 వికెట్లు పడగొట్టగా.. హ్యారీస్ రౌఫ్(72 మ్యాచ్‌ల్లో), ఎహసన్ ఖాన్(71 మ్యాచ్‌ల్లో) ఈ ఫీట్ సాధించారు. అర్ష్‌దీప్ సింగ్.. ఐసీసీ టీ20 క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ 2024గా ఎంపికయ్యాడు. టీ20 ప్రపంచకప్ 2024లో పవర్ ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కూడా అర్ష్‌దీప్ సింగ్ నిలిచాడు.

# రంజీ బరిలో విరాట్ కోహ్లీ...

# అభిమానులకు బ్యాడ్ న్యూస్!

**గురువారం నుంచి రైల్వేస్ జట్టుతో ఢిల్లీ రంజీ మ్యాచ్**
**13 ఏళ్ల రంజీ బరిలో దిగుతున్న రన్‌మెషీన్**
**అయితే, ఈ మ్యాచ్ లైవ్ కవరేజీపై సందిగ్ధత**
**బీసీసీఐ ఇప్పటివరకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని ఢిల్లీ క్రికెట్ సంఘం వెల్లడి**




టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దాదాపు 13 ఏళ్ల తర్వాత రంజీ బరిలోకి దిగనున్నాడు. 2012లో చివరిసారిగా యూపీపై ఈ రన్‌మెషీన్ రంజీ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే దేశవాళీ క్రికెట్ బరిలోకి దిగుతున్నాడు. ఎల్లుండి (గురువారం) నుంచి రైల్వేస్‌తో జరగనున్న ఈ మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున కోహ్లీ ఆడనున్నాడు. ఆయుష్ బదోనీ సారథ్యంలో ఢిల్లీ జట్టు బరిలోకి దిగనుంది. కాగా, కోహ్లీకి కెప్టెన్సీ ఆఫర్ వచ్చినా తిరస్కరించాడని తెలుస్తోంది. కాగా, తమ అభిమాన ప్లేయర్ ఆటను టీవీల్లో వీక్షించాలనుకునే అభిమానులకు షాక్ తగలనుంది. ఎందుకంటే ఈ మ్యాచ్ లైవ్ కవరేజీ ఉండకపోవచ్చని సమాచారం. ఇప్పటివరకైతే బీసీసీఐ ఈ మ్యాచ్ లైవ్ కవరేజీపై ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని తెలుస్తోంది. ఈ విషయంపై తాజాగా ఢిల్లీ క్రికెట్ సంఘం స్పందించింది. "బీసీసీఐ ఏమైనా చివరి నిమిషంలో లైవ్ కవరేజీకి ఏర్పాట్లు చేస్తుందేమో తెలియదు. ఇప్పటివరకైతే మాకు ఎలాంటి సమాచారం లేదు. కామన్‌గానైతే పెద్ద మ్యాచ్‌లకు లైవ్ టెలికాస్ట్ లేదా ఓటీటీ స్ట్రీమింగ్‌కు ఇచ్చే అవకాశం ఉంటుంది. బ్రాడ్‌కాస్టర్‌ను రోస్టర్ పద్ధతిలో చేసేందుకు ముందుగానే నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది" అని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇక లైవ్ ఇవ్వడానికి కావాల్సిన సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలంటే కొంచెం సమయం పడుతుంది. మల్టీ కెమెరా సెటప్‌ను రెడీ చేయాల్సి ఉంటుంది. కానీ, ఈ మ్యాచ్ కు రెండు రోజులే మిగిలాయి. దీంతో ఈ మ్యాచ్ లైవ్ కవరేజీ ఉంటుందా? ఉండదా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

# గావస్కర్ పై బీసీసీఐకి రోహిత్ శర్మ కంప్లైంట్.. ఎందుకంటే?



దిగ్గజ క్రికెటర్ సునీల్ గావస్కర్ పై టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఫిర్యాదు చేశాడని తెలిసింది. గావస్కర్ తీరు నచ్చక.. ఆయనపై బీసీసీఐకి కంప్లైంట్ ఇచ్చాడని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి.
ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో బీసీసీఐ రివ్యూ మీటింగ్ నిర్వహించగా.. ఆ సమావేశంలోనే రోహిత్ శర్మ.. సునీల్ గావస్కర్ గురించి లేవనెత్తినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇంతకీ అసలు ఏం జరిగిందంటే? రీసెంట్ గా జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీతో పాటు ఇతర సిరీస్ ల్లోనూ కెప్టెన్ రోహిత్ శర్మ పేలవ ప్రదర్శన కొనసాగిస్తున్నాడు. దీంతో అతడి కెప్టెన్సీతో పాటు బ్యాటింగ్ తీరుపై చాలా విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే సునీల్ గావస్కర్ కూడా రోహిత్ ఆటతీరుపై విమర్శలు చేశారట. అయితే ఈ విమర్శలకు రోహిత్ నొచ్చుకున్నాడని తెలిసింది. అందుకే హిట్ మ్యాన్ బీసీసీఐకి ఫిర్యాదు చేశాడని సమాచారం. ఆస్ట్రేలియా పర్యటనలో తన ప్రదర్శన గురించి సునీల్ గావస్కర్ చేసిన కామెంట్స్ హద్దులకు మించి ప్రతికూల కామెంట్స్ చేశారని రోహిత్ సమావేశంలో చెప్పాడట. ఇతర క్రికెటర్లపై కూడా గావస్కర్ ఇలానే టూ మచ్ నెగటివ్ కామెంట్స్ చేస్తున్నారని, అలా చేయడం కరెక్ట్ కాదని అన్నాడట. "సునీల్ గావస్కర్ ఆటగాళ్లను మరీ ఇంత దారుణంగా విమర్శించడం సరికాదని రోహిత్ చెప్పాడు. గావస్కర్ చేసే విమర్శల వల్ల ఆటగాళ్ల మూడ్, మైండ్ సెట్ మారిపోతుంది. వారిపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి ఇలాంటి విమర్శలను తీవ్రంగా పరిగణించాలి" అని రోహిత్ శర్మ బీసీసీఐకి చెప్పాడని ఓ క్రికెట్ ప్రతినిధి చెప్పారు.

**సునీల్ గవాస్కర్ కామెంట్స్ ఏమన్నారంటే?**

సునీల్ గావస్కర్ గతంలో విరాట్ కోహ్లీ, పంత్, బుమ్రాపై కూడా కామెంట్స్ చేశారు. రిషబ్ పంత్ అగ్రెసివ్ బ్యాటింగ్ స్టుపిడ్, ఫూల్ అంటూ విమర్శించారు. రోహిత్ శర్మ నేతృత్వంలో టీమిండియా ఓడిపోతున్న నేపథ్యంలో జస్ప్రీత్ బుమ్రాకు కెప్టెన్సీ ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. రోహిత్ శర్మకు పాప ఉంది. కాబట్టి అతడు భార్యతో విశ్రాంతి తీసుకోవడం మంచిది అని సెటైర్లు వేశారు. ఓసారి కోహ్లీపై కూడా విమర్శలు చేస్తే, ఆ సమయంలో అనుష్క శర్మ కౌంటర్ కూడా ఇచ్చారు.

# 13 ఏళ్ల తర్వాత రంజీ బరిలో కోహ్లీ..



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దేశవాళీ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అందుబాటులో ఉన్న అంతర్జాతీయ క్రికెటర్లంతా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ నయా రూల్ తీసుకురావడంతో ఇప్పటికే స్టార్ ఆటగాళ్లంతా రంజీ ట్రోఫీలోకి రీఎంట్రీ ఇచ్చారు. ఇప్పటికే కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, శుభమన్ గిల్ రంజీ ట్రోఫీలోకి రీఎంట్రీ ఇచ్చారు. మెడ నొప్పి కారణంగా కోహ్లీ రీఎంట్రీ ఆలస్యమైంది. ప్రస్తుతం కోలుకున్న కోహ్లీ.. ఢిల్లీ తరఫున రైల్వేస్‌తో గురువారం నుంచి ప్రారంభమయ్యే మ్యాచ్‌లో అతను బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్ కోసం ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ జట్టును ప్రకటించగా.. ఆ టీమ్‌లో విరాట్ కోహ్లీ ఉన్నాడు. ఇప్పటికే కోహ్లీ.. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ముంబైలోని అలీబాగ్‌లో ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేశాడు. స్క్వేర్ ఆఫ్ ది వికెట్ షాట్లను బాదడంతో పాటు బ్యాక్‌ఫుట్‌పై ఆడడంపై ఫుల్ ఫోకస్ పెట్టాడు. ముఖ్యంగా ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీల బలహీనతను అధిగమించడంపై బంగర్‌తో కలిసి వర్క్ చేశాడు. ఢిల్లీ జట్టుతో కలిసి కూడా ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. కుర్రాళ్లతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడాడు. 13 ఏళ్ల తర్వాత కోహ్లీ రంజీ ట్రోఫీ బరిలోకి దిగడంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రేజ్‌ను క్యాష్ చేసుకునేందుకు జియో సినిమా సిద్ధమైంది. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా ప్రసారం చేస్తామని ప్రకటించింది. జియో సినిమా, స్పోర్ట్స్ 18లో ఈ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం కానుంది. జియో సినిమాలో ఉచితంగా ఈ మ్యాచ్ చూడవచ్చు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానం వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌ను ఉచితంగా చూసే అవకాశాన్ని డీడీసీఏ ప్రేక్షకులకు కల్పించింది. ఎలాంటి టికెట్లు లేకుండానే ఈ మ్యాచ్‌ను ఫ్రీగా చూడవచ్చు. ఢిల్లీ జట్టు: ఆయుష్ బదోని(కెప్టెన్), విరాట్ కోహ్లీ, ప్రణవ్(కీపర్), సనత్ సంగ్వాన్, అర్పిత్ రాణా, మయాంక్ గుసైన్, శివమ్ శర్మ, సుమిత్ మతుర్, వాన్ష్ బేడీ(కీపర్), మనీ గ్రేవల్, హర్ష్ త్యాగి, సిద్దాంత్ శర్మ, నవ్‌దీప్ సైనీ, యశ్ ధుల్, గగన్ వాత్స్, జాంటీ సిధు, హిమ్మత్ సింగ్, వైభవ్ కండపాల్, రాహుల్ గెహ్లాత్, జితేశ్ సింగ్.

# సంజూ శాంసన్ ఎత్తుగడ.. మూడో టీ20లో

## అతడిని దెబ్బతీసేందుకు



ప్రస్తుతం ఇంగ్లాండ్ తో జరిగిన రెండు టీ20ల్లో టీమిండియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు భారత ఆటగాళ్ల దృష్టి హ్యాట్రిక్ విజయంతో పాటు సిరీస్‌ను కైవసం చేసుకోవడంపై ఉంది.

**రాజ్‌కోట్ వేదికగా మూడో టీ20 జరగనుంది.**

అయితే తొలి రెండు టీ20ల్లో పెద్దగా ప్రభావం చూపని సంజూ శాంసన్.. ఎలాగైనా ఇప్పుడు మూడో టీ20లో రాణించాలని పట్టుదలతో ఉన్నాడు. తొలి మ్యాచ్‌లో 26 పరుగులు చేసిన అతడు.. దాన్ని పెద్ద ఇన్నింగ్స్ గా మలచలేకపోయాడు. రెండో టీ20లో పూర్తిగా ఫ్లాప్ అయిపోయాడు. ఐదు పరుగులకే ఔట్ అయిపోయాడు. ఈ రెండు మ్యాచ్ ల్లోనూ జోఫ్రా ఆర్చర్‌కే వికెట్ సమర్పించుకున్న అతడు.. షార్ట్ పిచ్ బంతులను ఆడటంలో కాస్త గట్టిగానే ఇబ్బంది పడ్డాడు. దీంతో ఇప్పుడు మూడో టీ20లో అలా జరగకుండా ఉండేందుకు తీవ్ర సాధన చేస్తున్నాడు సంజూ శాంసన్. ముఖ్యంగా ఆర్చర్‌కు దొరకకూడదనే ఉద్దేశంతో స్పెషల్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. దాదాపు 45 నిమిషాల పాటు ప్లాస్టిక్ బంతితోనే పుల్, హుక్ షాట్లను ఆడుతూ ప్రాక్టీస్ చేశాడు. ఇంకా ర్యాంప్, కట్ షాట్లను ఆడాడు. క్లైంబింగ్ బాల్ తోనూ ప్రాక్టీస్ చేశాడు. కొత్త బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ఆధ్వర్యంలో సిమెంట్ పిచ్‌పై బ్యాటింగ్ చేస్తూ సాధన చేశాడు. త్రోడౌన్ స్పెషలిస్టులు కూడా సంజూకు హెల్ప్ చేశారు.

**తుది జట్లు**

టీమిండియా (అంచనా): సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ, అభిషేక్ శర్మ, శివమ్ దూబె, హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్


ఇంగ్లాండ్ : జోస్ బట్లర్ (కెప్టెన్), ఫిల్ సాల్ట్ (వికెట్ కీపర్), లియామ్ లివింగ్ స్టోన్, జేమీ స్మిత్, హ్యారీ బ్రూక్, జేమీ ఓవర్టన్, మార్క్ వుడ్, జోఫ్రా ఆర్చర్, బ్రైడన్ కార్స్, బెన్ డకెట్, అదిల్ రషీద్.

# కోహ్లీ రంజీ మ్యాచ్ కన్ఫామ్..



టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ రంజీ మ్యాచ్ ఆడుతున్నాడా? లేదా?.. గత కొద్ది రోజులుగా క్రికెట్ అభిమానులను తెగ ఊరిస్తోన్న విషయం. అయితే ఎట్టకేలకు విరాట్ రంజీ ఆడేందుకు సిద్ధమైపోయినట్లు స్పష్టత వచ్చింది. ఇప్పటికే ప్రాక్టీస్ ప్రారంభించిన అతడు.. కచ్చితంగా రైల్వేస్ తో జరిగే మ్యాచ్ లో దిగుతాడని క్లారిటీ అయింది. తాజాగా దిల్లీ క్రికెట్ సంఘం అధికారికంగా టీమ్ సభ్యుల పేర్లను ప్రకటించింది. ఆ జట్టులో కోహ్లీ కూడా ఉన్నాడు. ఈ జట్టుకు ఆయుష్ బదోని సారథిగా వ్యవహరిస్తున్నాడు. ఇప్పుడతడు దిల్లీ టీమ్ తో కలిసి ప్రాక్టీస్ కూడా చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటికే కోహ్లీ.. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ముంబయిలోని అలీబాగ్‌లో ప్రాక్టీస్ చేసిన సంగతి తెలిసిందే. స్క్వేర్ ఆఫ్ ది వికెట్ షాట్లను బాదడంతో పాటు బ్యాక్‌ఫుట్‌పై ఆడడంపై ఫుల్ ఫోకస్ పెట్టాడు. " కోహ్లితో కలిసి ఆడబోతుండడం, డ్రెస్సింగ్ రూమ్ షేర్ చేసుకోబోతుండటం.. దిల్లీ యంగ్ ప్లేయర్స్ కు ఓ మంచి అనుభవం అవుతుంది. మా జట్టులో విరాట్ కాకుండా నవ్‌దీప్ సైని ఒక్కడే టీమిండియాకు ప్రాతినిధ్యం వహించాడు. ఇంకెవరూ కూడా నేషనల్ టీమ్ కు ఆడలేదు. ఇక వారు కోహ్లీ నుంచి నేర్చుకుంటారు. కోహ్లీ జట్టులోకి రావడం వల్ల భద్రతను భారీగా పెంచాం" అని దిల్లీ క్రికెట్ తెలిపింది. ఈనెల 30న రైల్వేస్‌తో జరగబోయే మ్యాచ్‌లో కోహ్లీ ఆడతాడు. చివరిగా [illegible]

# 18 రోజులు.. 10వేల అథ్లెట్లు.. ప్రపంచంలోనే అతిపెద్ద టోర్నీ షురూ




38వ జాతీయ క్రీడలకు రంగం సిద్ధమైంది. ఈ క్రీడల ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి మోదీ రానున్నారు. ఉత్తరాఖండ్‌లోని ఏడు నగరాలు ఈ మెగా క్రీడలకు ఆతిథ్యమిస్తున్నాయి. మొత్తం 18 రోజుల పాటు సాగే ఈ క్రీడా టోర్నీలో 32 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ట్రయథ్లాన్, హ్యాండ్‌బాల్ పోటీలు కూడా ప్రారంభమయ్యాయి.

**ఇదే అతిపెద్ద క్రీడా టోర్నీ**

ఈ క్రీడల్లో 38 జట్లు పాల్గొంటున్నాయి. దాదాపు 10 వేలకు పైగా అథ్లెట్లు, ప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అథ్లెట్ల సంఖ్య ప్రకారం చూస్తే... ప్రపంచంలోనే ఇదే అతిపెద్ద క్రీడా టోర్నీ కావడం విశేషం.

**'మౌలి' మస్కట్**

ఉత్తరాఖండ్ ఆవిర్భవించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ క్రీడలను ఆ రాష్ట్రం ఘనంగా నిర్వహిస్తోంది. పైగా ఆ రాష్ట్ర పక్షి 'మోనాల్' కావడంతో.. దానినే స్ఫూర్తిగా తీసుకుని ఈ క్రీడలకు 'మౌలి' మస్కట్‌ను రూపొందించారు. ఈ మస్కెట్.. ఉత్తరాఖండ్ రాష్ట్ర సహజ అందాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తోంది.

**ఏఏ పోటీలు నిర్వహిస్తున్నారంటే**

ఒలింపిక్ క్రీడలు అథ్లెటిక్స్, రెజ్లింగ్, షూటింగ్, స్విమ్మింగ్, హాకీ, బాక్సింగ్, బ్యాడ్మింటన్ సహా ఇతర ట్రెడిషనల్ గేమ్స్ కబడ్డీ, ఖోఖోనూ కూడా నిర్వహిస్తున్నారు. ఇంకా యోగాసన, రాఫ్టింగ్ మల్లఖంబ్, కలరిప్పయట్టును కూడా ఈ క్రీడల్లో చేర్చారు. అయితే వీటికి మెడల్స్ ఇవ్వరు.

**ఎవరెవరు పాల్గొంటున్నారంటే**

ఒలింపిక్ పతక విజేతలు జ్యోతి యర్రాజి, లవ్లీనా , విజయ్ కుమార్ (షూటింగ్), సరబ్‌జోత్, స్వప్నిల్ కుశాలెతో పాటు పలువురు ఈ క్రీడల్లో పాల్గొనే అవకాశముంది. నీరజ్ చోప్రా, మను బాకర్ వేర్వేరు కారణాలతో ఈ క్రీడలకు అందుబాటులో ఉండట్లేదు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**